నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 26-1-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 155 | పేజీలు:4 | వెల: రూ.1/-

టర్కీలో భూకంపం

18మంది మృతి

న్యూఢిల్లీ,జనవరి25(ఆర్ఎన్ఎ): టర్కీలో శుక్రవారం అర్ధరాత్రి భారీ భూకంపం వచ్చింది. ఈ ప్రమాదంలో సుమారు 18మంది చనిపోగా.. దాదాపు 500మందికి పైగా గాయపడ్డారు. తూర్పు టర్కీలోని ఇలాజిజ్ ప్రావిన్స్, సివ్ రిన్ జిల్లాలో వచ్చిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్ తీవ్రత 6.8గా నమోదైంది. భూకంపం ధాటికి ప్రజలు ఇళ్లు వదిలి బయటకు పరుగెత్తారు. భూకంపం తర్వాత భూ ప్రకంనలు నమోదయ్యాయని టర్కీ విపత్తు శాఖ పేర్కొంది. ప్రస్తుతం శిధిలాల్లో చిక్కికున్న వారిని రక్షించడానికి సహాయక సిబ్బంది శ్రమిస్తున్నారు. శిథిలాల కింద 30 మంది వరకు చిక్కికుని ఉండవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.ఎలజిగ్ ప్రావిన్సులోని సివ్రైస్ నగరం భూకంప కేంద్రంగా ఉన్నది. భారీ భూకంపంతో అనేక బిల్డింగ్‌లు కూలాయి. జనం వీధుల వెంట పరుగులుతీశారు. సిరియా, లెబనాన్, ఇరాన్ దేశాల్లోనూ భూప్రకంపనలు నమోదు అయ్యాయి. 1999లో టర్కీలో వచ్చిన భూకంపంలో సుమారు 17వేల మంది మరణించారు. శుక్రవారం వచ్చిన భూకంపం తర్వాత సుమారు 60 సార్లు భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి.

నాగోబా గిరిజన జాతరకు శ్రీకారం

నాగోబా గిరిజన జాతరకు శ్రీకారం
అర్ధరాత్రి పూజలతో మొదలైన పండగ
వేకువ జామునుంచే భక్తుల రాక
భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

ఆదిలాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో మేడారం జాతర తరువాత రెండవ పెద్ద గిరిజన జాతర కేస్లాపూర్ నాగోబాదే. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో వెలసిన ఆదివాసీ మెస్రం గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబాకు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రాంభమయ్యింది. దీంతో శనివారం నుంచి భక్తుల రాక మొదలయ్యింది. ఉదయం మెస్రం వంశీయులు మరోమారు శాస్త్రోక్తంగా పూజలు మొదలు పెట్టాక, నాగోబాను సందర్శించుకునేందుకు గిరిజనులు పోటీ పడ్డారు. మెస్రం గిరిజనులు పూజలు నిర్వహించిన అనంతరం నాగోబా జాతర ప్రారంభమైంది. మెస్రం గిరిజనుల జనసందోహంతో నాగోబా జాతరకు కల వచ్చింది. ఐదు రోజుల క్రితం పవిత్ర గోదావరి జలాలతో మెస్రం గిరిజనులు మర్రిచెట్టు చెంతకు చేరడంతో నాగోబా జాతర సందడి మొదలైంది. నెలరోజుల ముందునుంచే జిల్లా అధికారులు నాగోబా జాతర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మెస్రం వంశీయులు సిరికొండ మండల కేంద్రానికి వెళ్లి కొత్త కుండలను బుధవారం తెచ్చారు. ఆకుండలను ఆలయం వెనుక ప్రాంతంలో భద్రపరిచారు. మెస్రం గిరిజనులు శుక్రవారం మర్రి చెట్టు విడది నుంచి మహిళలు, పురుషులు తమ గిరిజన సాంప్రదాయ వాయిద్యాలతో ఆలయానికి చేరుకున్నారు. వారి వెంటనే పవిత్ర గోదావరి జలాలు తెచ్చిన మెస్రం వంశీయులు సైతం ఆలయానికి చేరుకోని ఆలయం వెనుక బాగంలో పవిత్ర జలాల కలశాన్ని కింద పెట్టకుండా రెండు కట్టెలను కట్టి వాటిపై భద్రపరిచారు. సిరికొండ నుంచి తెచ్చిన కొత్త కుండలకు పూజలు మెస్రం గిరిజనులు నిర్వహించారు. అనంతరం కొత్తకుండలను మెస్రం మహిళలకు ఒకోక్కటి అందించారు.

కుండల్లో మర్రి చెట్టు వద్ద ఉన్న కోనేరు నీటిని మెస్రం మహిళలు కొత్తకుండల్లో తీసుకొని ఆలయానికి బయలుదేరి నాగోబా ఆలయం శుద్ధి చేశారు. ఆ తరువాత హస్తిన మడుగు నుంచి తెచ్చిన గోదావరి పవిత్ర జలాలతో నాగోబాకు అభిషేకం నిర్వహించారు. అనంతరం మెస్రం ఆడపడచులు, అల్లుళ్లు ఆలయంలోని పాత పుట్టను తవ్వి కొత్త పుట్టను తయారు చేశారు. ఆ పుట్ట నుంచి సేకరించిన మట్టితో ఏడుగురు దేవతల ప్రతిమలు ఉండల రూపంలో రూపొందించి ఆలయంలో సతీ దేవతగా పూజలు చేశారు. మర్రి చెట్టు నుంచి వచ్చిన మహిళలు గోవాడ్‌కు చేరుకోని ఆచారం ప్ర కారం 22 పోయ్యిలను ఏర్పాటు చేసి వంట మొదలు పెట్టారు. శుక్రవారం రాత్రి మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల అనంతరం జాతర ప్రారంభం అయి నట్లు మెస్రం వంశీయులు ప్రకటించారు. ఐదు రోజుల క్రితం పవిత్ర గంగాజాలం లో మర్రి చెట్టునీడకు చేరుకున్న మెస్రం గిరిజనులు తమ పూర్వీకులను స్మరిస్తు తూం పూజలు ఆచారవ్యవహారాలతో నిర్వహించారు. సిరికొండ నుంచి కొత్త కుండలను తెచ్చిన తరువాత మర్రి చెట్టు వద్ద ఉన్న కోనేరు నుంచి మహిళలు నీళ్లు తీసుకోని ఆలయానికి చేరుకున్నారు. గోదావరి జలాలతో మెస్రం వంశీయులు తమ ఆచార సాంప్రదాయాల ప్రకారం గిరిజన సంస్కృతికి అద్దం పట్టే విధంగా మేళాతాళాల మధ్య నాగోబాకు పూజలు నిర్వహించారు. అనాదిగా కొనసాగుతున్న ఈ పండుగను గిరిజనులు ఎంతో సంతోషంగా నిర్వహిస్తున్నారు. ప్రతి యేటా జరుగుతున్న విధంగానే నాగోబా జాతరలో ఎలాంటి అల్లర్లకు తావులేకుండా శాంతి భద్రతలను కాపాడడానికి పోలీసులు కృషి చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ప్రదర్శించడానికి నాగోబా జాతర దర్బార్ సమీపంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. అందులోనే జిల్లాలోని గిరిజనులు తమ సమస్యలను తెలిపే విధంగా గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు, ప్రజలకు ఎలాంటి వైద్య సహాయం అందించాలన్న కృషి చేయడానికి జిల్లా ఏజెన్సీ వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తమ స్టాల్స్‌లలో ఫోటోల ప్రదర్శనను ఇంకా ఏర్పాటు చేయాల్సి ఉంది. నెల 27న నిర్వహించనున్న నాగోబా దర్బార్‌ను 29కి వాయిదా వేసినట్టు మెస్రం వంశీయులు ప్రకటించారు.

మేడారానికి జాతర కళ

పోటెత్తుతున్న భక్తులు

ములుగు,జనవరి25(ఆర్ఎన్ఎ): మేడారానికి జాతర కళ వచ్చింది. సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడేలా మేడారం జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రెండేళ్లకోమారు జరిగే జాతరలో దాదాపు కోటిమంది పాల్గొంటారు. అధికారకంగా జాతర ప్రారంభం కాకముందే లక్షలాది జనం తరలిస్వున్నారు. గద్దెల వద్ద పూజలు నిర్వహిస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం సకల సౌకర్యాలను కల్పిస్తున్నదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. జాతర సమయం సమీపిస్తుండటంతో పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మేడారం జాతరను దేశంలోనే నంబర్ వన్‌గా నిర్వహించేందుకు నిధులు కేటాయిస్తు న్నారని వెల్లడించారు. ఫిబ్రవరి 7న సీఎం కేసీఆర్ మేడారం సందర్శించి దేవతలకు మొక్కులు చెల్లించుకునే అవకాశం ఉందని తెలిపారు. సమ్మక్క-సారలమ్మను దర్శించుకునేందుకు జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మేడారాన్ని దేశంలోనే నంబర్‌వన్ జాతరగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయిస్తున్నారని వెల్లడించారు. జాతరలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టామని, గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా మహా జాతర నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జాతర నేపథ్యంలో ఆదివాసీ గిరిజన సంఘాలు, దేశవ్యాప్తంగా ప్రముఖులకు ఆహ్వానాలు పంపిస్తున్నామని వివరించారు. జాతర సమయంలో ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జాతరకు సమయం సమీపిస్తు న్నందున శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గోడలపై ప్రభుత్వ పథకాలు, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే చిత్రాలు వేయాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తెలంగాణకు చెందిన పర్యాటకులు గోవా, సింగపూర్ తదితర పర్యాటక ప్రాంతాలకు వెళ్తుంటారని, ములుగు జిల్లాలో విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా స్థలాలు ఉన్నాయన్నారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని వివరించారు.

కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకున్న విశ్వాసం

విజయం కోసం కృషిచేసిన ప్రతికార్యకర్తకు ధన్యవాదాలు
అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్లే ఈ విజయం
ఫలితాలపై స్పందించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి భారీ విజయం అందించిన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు మరోసారి బలపరిచారు అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత నుంచి ప్రతి ఎన్నికల్లో గెలుస్తూ వచ్చాం. 2014 నుంచి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. మున్సిపల్ మంత్రిగా ఈ ఫలితాలు తన బాధ్యతను మరింత పెంచాయని కేటీఆర్ చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం కోసం కృషిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. 100కు పైగా మున్సిపాలిటీల్లో విజయం సాధించడం గొప్ప విషయం అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇదంతా కెసిఆర్ నాయకత్వంపై ప్రజలకున్న విశ్వాసమని అన్నారు.

ఇదిలావుంటే రాష్ట్రంలో మున్సిపాలిటీలల్లో టీఆర్ఎస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యత నమోదు చేసింది. అత్యధిక మున్సిపాలిటీలను టీఆర్ఎస్ పార్టీనే కైవసం చేసుకుంది. అయితే.. మున్సిపల్ ఎన్నికల ఫలితాల సరళిపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడూ ఫలితాలను తెలుసుకున్నారు.

ఇక మేయర్, ఛైర్‌పర్సన్ ఎన్నికల నేపథ్యంలో ఎక్స్‌ఆఫిషియో ఓట్లపై కేటీఆర్ చర్చించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలకు అనుగుణంగా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు తమ ఎక్స్‌ఆఫిషియో ఓటును ఎక్కడ నమోదు చేసుకోవాలో ఈ సమావేశంలో నిర్ణయించినట్టు తెలుస్తోంది. కార్పొరేషన్ మేయర్ లేదా మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికకు ఎక్కడైనా మెజార్టీ తక్కువైతే అక్కడ తమ ఎక్స్‌ఆఫిషియో ఓట్లు ఉండేలా నమోదు చేసుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది.

దీనిపై ఎంపీలు, ఎమ్మెల్సీలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌కు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు

పార్టీ శ్రేణులకు కవిత అభినందనలు

మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి భారీ విజయాన్ని కట్టబెట్టిన తెలంగాణ ప్రజలకు టీఆర్ఎస్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ తరపున విజయం సాధించిన అభ్యర్థులకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం కోసం కష్టపడిన ప్రతి టీఆర్ఎస్ కార్యకర్తకు కవిత అభినందనలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 100కు పైగా మున్సిపాలిటీల్లో టీఆర్ఎస్ విజయం సాధించింది.

పట్టణాల్లోనూ గుబాళించిన గులాబీ

మున్సిపాల్టీల్లో విరగబూసిన గులాబీ
పుర ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌కే పట్టం
ఎన్నిక ఏదైనా తిరుగులేదని నిరూపించిన టిఆర్ఎస్
కారు స్పీడును అందుకోలేకపోయిన కాంగ్రెస్, బిజెపి
ఫలించిన కెసిఆర్ ఆదేశాలు..కెటిఆర్ వ్యూహాలు
తెలంగాణభవన్‌కు చేరుకుంటున్న నేతలు
ఫలితాల సరళిని సమీక్షిస్తున్న మంత్రి కెటిఆర్

హైదరాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ విరగబూసింది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో .. టీఆర్ఎస్ పార్టీ హవా కొనసాగుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే ఆ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల్లో జయభేరీ మోగించిన టీఆర్ఎస్.. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే జోరును ప్రదర్శించింది. కారు వేగానికి బ్రేక్ లేదని పట్టణ ప్రజలు కూడా తేల్చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఫలితాలు అనుకూలంగా రావడంతో టిఆర్ఎస్ శ్రేణుల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. మొత్తం 120 మున్సిపాల్టీల్లో గులాబీనే క్లీన్ స్వీప్ చేసే దిశగా సాగుతోంది. 9 కార్పొరేషన్లలో కూడా కారు ప్రభంజనం సృష్టిస్తున్నది. కెటిఆర్ వ్యూహం, కెసిఆర్ దిశానిర్దేశంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు ఉమ్మడి కృషి ఫలితంగా ఫలితాలు అనుకూలంగా వస్తున్నాయి. ఫలితాల తీరు టిఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతోంది. మంత్రుల ఇలాఖాల్లో తిరుగులేకుండా పోయింది. ఉమ్మడి వరంగ్ల, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, పాలమూరు తదితర జిల్లాల్లో పట్టు సాధించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పట్టు సాధించడం విశేషం. మున్సిపాల్టీల్లో దాదాపు 80 శాతం వార్డులను టీఆర్ఎస్ కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. కనీసం వంద మున్సిపాల్టీలు టీఆర్ఎస్ వశం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. తాజాగా వెల్లడవుతున్న ఫలితాల అంచనా ప్రకారం టీఆర్ఎస్.. సుమారు 110 మున్సిపాల్టీలను చేజిక్కించుకోనున్నట్లు తెలుస్తోంది. జనవరి 22న జరిగిన మున్సిపల్ ఎన్నికలు జరగగా శనివారం కౌంటింగ్ చేపట్టారు. అయితే ఫలితాలకు ముందే అభ్యర్థులు 81 స్థానాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. దాంట్లో టీఆర్ఎస్ వారే 78 మంది ఉన్నారు. చెన్నూరు, వర్ధనపేట, సూర్యాపేట, పరకాల మున్సిపాల్టీల్లో దాదాపు టీఆర్ఎస్ హవా కొనసాగుతున్నది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలు ఓటర్లను ఆకర్షించాయని రుజువయ్యింది. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల విద్యుత్ సరఫరా, మిషన్ భగీరథ లాంటి స్కీమ్‌లు ప్రజల అవసరాలను తీర్చాయి. కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లాంటి పథకాలు కూడా కొన్ని పట్టణ ఓటర్లను ఆకట్టుకున్నాయి. వివిధ రకాల పథకాలతో ప్రజల అవసరాలను తీర్చుతున్న టీఆర్ఎస్ పార్టీకే ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో పట్టంకట్టారు. టీఆర్ఎస్ జయకేతనం ఎగురవేయడంతో.. తెలంగాణ భవన్‌లో పండుగ వాతావరణం నెలకొన్నది. మున్సిపాలిటీల్లోని వార్డులు, కార్పొరేషన్ల పరిధిలోని డివిజన్‌లలో పోటీ చేసిన టీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందుతున్నారు. ఉదయం 10 గంటల వరకు వెల్లడైన ఫలితాల్లో టీఆర్ఎస్ ఏకంగా 44 మున్సిపాలిటీ ల్లో ఘన విజయం సాధించింది. రెండు కార్పొరేషన్లను సైతం టీఆర్ఎస్ తన ఖాతాలో వేసుకుంది. మెజార్టీ మున్సిపాలిటీల కైవసం దిశగా టీఆర్ఎస్ దూసుకెళ్లోంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ పురపాలికను టీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మొత్తం 15 వార్డుల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు ఏకపక్ష విజయం సాధించారు.

భీంగల్ మున్సిపాలిటీలో టీఆర్ఎస్ దాదాపు ఏకపక్ష విజయంతో సత్తా చాటింది. ధర్మపురి టిఆర్ఎస్ ఖాతాలో పడింది. ఫలితాలు అనుకూలంగా వస్తున్న నేపథ్యంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీఆర్ఎస్ నేతలు, శ్రేణులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తెలంగాణ భవన్‌కు చేరుకుంటున్నారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఇప్పటికే తెలంగాణ భవన్ చేరుకుని, అక్కడ నుంచి ఎన్నికల కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్నారు. ఇక ఫలితాల అనంతరం సంబరాలు జరపడానికి పార్టీ శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ టీఆర్ఎస్ కైవసం చేసుకుంది. 120 మున్సిపాలిటీల్లో మెజార్టీ స్థానాల్లో అధికార కారు పార్టీ విజయం సాధించింది. ప్రతిపక్ష కాంగ్రెస్‌ను చిత్తుచేస్తూ.. పూర్తి ఆధిక్యంలో దూసుకుపోతోంది. అత్యధిక వార్డులు కైవసం చేసుకోవడంతో టీఆర్ఎస్ శ్రేణులు, నేతలు సంబంధాల్లో పాల్గొన్నారు. టీఆర్ఎస్ గెలుపుతో రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు మిన్నంటాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. జిల్లాలు, మండల కేంద్రాల్లోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున కార్యకర్తలు చేరుకుని అప్పుడే స్వీట్స్ పంచుకుని.. బాణాసంచాలు కాల్చి ఆనందం పంచుకున్నారు.

మున్సిపల్ ఎన్నికల ఫలితాల సరళిపై పార్టీ నేతలతో తెలంగాణ భవన్‌లో సమీక్షించిన పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్

కాంగ్రెస్,బిజెపిలు గెలిచిన చోట ప్రతివ్యూహాలు

ఎక్స్ అఫీషియో ఓట్లతో దెబ్బతీసే రణతంత్రం
రెబల్స్ గెలిచిన చోట ప్రత్యేక కార్యాచరణ
తెలంగాణ భవన్‌లో నేతలతో కేటీఆర్ సమీక్ష

హైదరాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ టీఆర్ఎస్ దూసుకుపోతోంది. మూడు ఎన్నికల్లో విజయాలతో ఉత్సాహంగా ఉన్న టీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అధిక సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునే దిశలో ముందుకు వెళ్తోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలు, హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాలుగా కనీసం ఉనికిని చాటుకోలేక పోయిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఈ ఎన్నికల్లో పలు చోట్ల విజయం సాధిస్తున్నాయి. మరోవైపు ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ కలిసి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. టీఆర్ఎస్‌కు 32 మంది ఎమ్మెల్సీలు, 9మంది లోక్‌సభ సభ్యులు, ఆరుగురు రాజ్యసభ సభ్యులకు ఎక్స్ అఫీషియో ఓటు హక్కు ఉంటుంది. దీంతో ఎక్కడైనా ఒకటి రెండు చోట్ల కాంగ్రెస్ గెలుచుకునప్పటికీ ఎక్స్ అఫీషియో ఓట్ల ద్వారా టీఆర్ఎస్ పార్టీ ఆయా మున్సిపాలిటీలు, మేయర్ పీఠాలను కైవసం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో పోలింగ్ సరళిని తెలంగాణ భవన్ నుంచి గమినిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అప్పుడే వ్యూహాలకు పదను పెట్టారని సమచారం. అక్కడక్కడా గెలుపుబాటలో ఉన్న కాంగ్రెస్, బిజెపిలను నిలువరించేందుకు ఎత్తుగడలు మొదలు పెట్టారని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ పార్టీ తన సత్తాను చాటుకుంది. నల్గొండ జిల్లా చిట్యాలలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పీఠాన్నికైవసం చేసుకోబోతుంది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌లో బిజెపి విజయం సాధించింది. కాగా రేవంత్‌రెడ్డి ఇలాక కొడంగల్‌లో టీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. గద్వాల జోగులాంబ, వడ్డేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉంది. సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా యాదగిరిగుట్టలో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఆ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ తన ఆధిక్యాన్ని కొనసాగిస్తోంది. మరోవైపు ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి రెబల్స్ బెడద అధికంగా ఉంది. రెబల్స్‌ను కట్టడి చేయాల్సిందిగా స్వయంగా సీఎం కేసీఆర్ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఫలించని పరిస్థితి నెలకొంది. టీఆర్ఎస్ పార్టీకి చెందిన రెబల్స్ అభ్యర్థులంతా ఫార్వర్డ్ బ్లాక్ అనే పార్టీ ద్వారా ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. కొల్లాపూర్‌లో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు వర్గం సత్తా చాటుతోంది. ఐజలోనూ రెబల్స్ హవా కొనసాగుతోంది. రెబల్స్‌ను కట్టడి చేసేందుకు రంగంలోకి దిగిన కేటీఆర్‌కు కూడా రెబల్స్ బెడద తప్పని పరిస్థితి నెలకొంది. స్వయంగా కేటీఆర్ సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్నప్పటికీ 10 మంది స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. ఇక రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా టీఆర్ఎస్ రెబల్స్ హవా కొనసాగుతోంది. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవం మున్సిపల్ ఎన్నికల్లో సైతం కొనసాగుతోంది. హుజూర్‌నగర్, కోదాడ మున్సిపాలిటీలను టీఆర్ఎస్ హస్తగతం చేసుకునే అవకాశాలు కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలో టీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోనుంది. అటు భైంసాలో బీజేపీ, ఎంఐఎం మధ్య హోరాహోరీ పోటీ కొనసాగుతోంది. ఇక్కడ టీఆర్ఎస్ ఒక్క వార్డును కూడా గెలుచుకోలేకపోయింది. రోవైపు తెలంగాణ జనసేన పార్టీ (టీజేఎస్) ఆవిర్భవించిన తర్వాత మున్సిపల్ ఎన్నికల్లో కేవలం ఒక్క వార్డును మాత్రమే కైవసం చేసుకుంది. తాండూరు మున్సిపాలిటీలో టీజేఎస్ ఒక వార్డును సొంతం చేసుకుంది. ఈ మున్సిపల్ ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ పార్టీ 90శాతంపైగా మున్సిపాలిటీలను కైవసం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ రెండో స్థానంలో తన ఉనికిని చాటుకునే ప్రయత్నాలు చేస్తోంది.

చరిత్రలో నేటినిజం

కం॥ నవ వరవమున, నవ పథమున
నవిరళ కవితి సలుపు చున్న ఆత్మీయుని గా
'రవితేజ'ను శ్లాఘించెద
ప్రవిమల నట నమ్ము మీకు ప్రస్తుతుల గానన్!!
[జనవరి 26 'రవితేజ' జననం]

(జనవరి 26 'రవితేజ' జనసం)

-రాధశ్రీ
సెల్: 9494481210

జీవితాన్ని గురించిన సత్యం సముద్రం చెబుతూనే ఉంటుంది..!!

నేటినిజం
ఆదివారం 26-1-2020

జీవితాన్ని గురించిన సత్యం సముద్రం చెబుతూనే ఉంటుంది. కెరటం ఎంతగా ఉవ్వెత్తున ఎగసినా కిందకు పడక తప్పదని. తనలో ఎన్ని అలజడులున్నా పైకి గంభీరంగా జీవితం సాగించాలని చెప్పకనే చెబుతుంది. జీవితంలో జయాపజయాలు సహజమే అనే ఆలోచన లేనంతవరకు మనిషి జీవితానికి దూరం అవుతూనే ఉంటాడు. అలాకాదు జయం ఉంటేనే జీవితం లేకుంటే చనిపోవడమే పరిష్కారం అనుకోవడం ఎంతవరకు సమంజసం? కోల్పోతున్న ఆత్మస్థైర్యం, ఊహించిన ఉద్యోగ అవకాశాలు, జీవితంపై అవగాహన, బాంధవ్యాలలో వచ్చే మార్పులు కారణంతో ఆత్మహత్యల పర్వం నిత్యం కొనసాగుతుండటం పట్ల పరిస్థితి అయోమయంలో పడేస్తోంది. కాకుంటే ఈ ఆత్మహత్యలన్నీ ఉన్నత స్థాయికి సంబంధించిన వారి నుండే కావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటే సరైన కారణం ఇది అని ఎప్పటికీ చెప్పలేము. కానీ అంతకు తెగించడానికి కారణాలు గుర్తించేందుకు వీలు ఉంటుందని మాత్రం విశ్లేషకులు చెబుతున్నారు. సామాన్యంగా ఒక వ్యక్తి మానసిక స్థైర్యాన్ని కోల్పోవడం అనేది కేవలం కుటుంబ వాతావరణమే 90 శాతం కారణం అవుతుందని తెలుస్తోంది. బయట ఎన్ని అవమానాలు, అపజయాలు ఎదురుచూసినా సరే ఇంటికి రాగానే కాస్తంత ప్రేమ, ఓదార్పు లేకుంటే ఆ మనిషి మానసిక స్థైర్యాన్ని పూర్తిగా కోల్పోతాడు. మరొక కారణం ఏమిటంటే జన్యుపరంగా కూడా ఈ గుణం అబ్బుతుందని చెబుతున్నారు. అంటే కుటుంబంలో ఎవరైనా ఈ విధంగా మరణించినట్లైతే, తర్వాతి వారిపై ఆ ప్రభావం వుంటుందంటున్నారు.

తన గురించి తప్పుగా చాలా మంది మాట్లాడుకుంటున్నారని, తాను ఓడిపోయినా బాగా జరిగిందని అందరూ అనుకుంటున్నారని తమలో తామే ఊహించుకుంటూ ఉంటారు. ఆత్మన్యూనత అనేది చాలా విచిత్రమైన జబ్బు. ఒకవేళ తన బాధను ఎవరికైనా చెప్పుకుందామంటే మరింత లోకువ అయిపోతానేమో, లేక ఆ వ్యక్తి ఈ విషయాల్ని మరికొందరికి చేరవేస్తాడేమో అని వాపోతూ తమ పరిస్థితిని తమలోనే తాము దాచుకుని కుమిలిపోతుంటారు. కాకుంటే ప్రతి మనిషికి ఒత్తిడి అనేది సహజం. కానీ ఆవొత్తిడిని తట్టుకోవాలంటే నా అనేవారి అండ ఎంతో అవసరం. ఎపుడైతే తాను ఆశించినంత అండను తాను ఎపుడైతే పొందలేకపోతాడో ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతుంటారు. మరో విషయంలోకి వెళితే ఒక వ్యక్తి ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకుని ప్రయాణిస్తుంటే కొందరు స్వార్థపరులు వేసే నిందలకో, కొందరు అసూయాపరులు వేసే అడ్డంకులకో ఆ లక్ష్యం నామరూపాలు లేకుండా పోయినపుడో కూడా ఇలాంటివి జరుగుతాయని తెలిపారు. అందుకే ఏ విషయాన్నైనా తల్లితండ్రులతో చాలా స్పష్టంగా చర్చించే విదేశీ సంస్కృతి ఎంతో మంచిదని తెలిపారు. మన దేశంలో సెలబ్రెటీలు తమకెన్ని సమస్యలు వచ్చినా ఎవరితోనూ చెప్పకుండా తమలో తామే కృంగిపోవడం జరుగుతుంది. కాకుంటే ఒక్కటి అందరూ గుర్తుంచుకోవాలి. జనం కాకుల్లాంటివారు. ఒకరు కా మరొకరు కా అనడం జరుగుతుంది. ఒకరి తప్పును ఎత్తిచూపి హేళన చేయడానికి అనేకమంది ఉంటారు. మళ్లీ వారే ఒక ఉన్నత స్థానంలోకి వచ్చినపుడు ఆ హేళన చేసినవారే పొడగటం మొదలుపెడతారు. ఇలాంటి సమాజానికి జడిసి జీవితాన్ని అంతం చేసుకోవడం ఎంతవరకు అనేది ఆలోచించాలి..!!

స్వచ్ఛ తెలంగాణకు సహకరించాలి

మరుగుదొడ్ల లక్ష్యం పూర్తి కావాలి

ఖమ్మం,జనవరి25(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం స్వచ్ఛ తెలంగాణ పేరుతో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నది. అందులో భాగంగానే ఇంటింట మరుగుదొడ్డి తప్పని సరి అవసరమని భావించిన ప్రభుత్వం ప్రతి ఒక్కరూ మరుగుదొడిడ నిర్మించుకునేందుకు చేయూతనందించింది. మరుగుదొడ్డు లేకపోతే బహిరంగ మలవిసర్జన ద్వారా ఎలాంటి నష్టాలు జరుగుతాయో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో మరుగుదొడ్లు నిర్మాణం చేయకపోవడంతో అంటువ్యాధులు తప్పవని ప్రచారం చేపట్టారు. దీంతో ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మాణం చేయాలనే పట్టుదలతో చేపట్టిన మహాయజ్ఞం పూర్తయ్యిందని, అతి త్వరలోనే ఖమ్మం జిల్లాను ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటిస్తామని జడ్పీ సీఈఓ తెలిపారు. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు, ప్రజలు స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు. పరిశుభ్రత ఉండాలంటే ప్రతిఒక్కరు మరుగుదొడ్డి నిర్మాణం చేసుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి, పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని సూచించారు. రోగాలువస్తే వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్న మనం, ఆ రోగం రాకుండా చూసుకునే చర్యలు తీసుకోవడంలో అజాగ్రత్త వహిస్తున్నామన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే, గ్రామంలో డ్రైనేజీ, మురుగు కాలువలు శుభ్రంగా ఉంచుకుంటే, ప్రతి ఇంటా మరుగుదొడ్డి, ఇంకుడు గుంతలుంటే ఊరంతా పరిశుభ్రంగా ఉంటుందన్నారు. అన్ని గ్రామాల ప్రజలు మరుగుదొడ్లు నిర్మాణం కోసం కృషి చేసి ఓడీఎఫ్‌లను ప్రకటించాలని కోరారు.

ప్లాస్టిక్ జెండాలు నిషేధం

నిజామాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని కాగితంతో తయారు చేసిన జెండాలను మాత్రమే వినియోగించాలని నిజామాబాద్ పోలీసు కమిషనర్ తెలిపారు. ఉత్సవాల తరువాత కాగితపు జెండాలను నేల పై వదిలివేయడం,పారవేయడం చేయరాదని అన్నారు. నిజామాబాద్‌లో జనవరి 26 వేడుకల సందర్భంగా ఎవరు కూడా జాతీయ పతాకానికి సంబంధించిన జెండాలను ప్లాస్టిక్‌తో తయారు చేయడాన్ని నిషేధించారని ఆయన వెల్లడించారు. కాగితంతో తయారు చేసినవి మాత్రమే వాడాలని అన్నారు. ప్లాస్టిక్ జెండాలను వాడినా, లేదా వ్యాపారస్తులు ఎవరైనా విక్రయించినా వారిపై చర్య తీసుకుంటామని సీపీ తెలిపారు. ప్లాస్టిక్ జెండాలను వినియోగిస్తే కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఉత్సవాలు ముగిసిన అనంతరం జాతీయ జెండాలను జాగ్రత్తగా, మర్యాద పూర్వకంగా తొలగించి గౌరవ ప్రదమైన ప్రదేశంలో భద్రపరచాలని సీపీ ఒక ప్రకటనలో తెలియజేశారు.

దళారుల ప్రమేయం లేకుండా కంది కొనుగోళ్లు

–అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ

ఆదిలాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది కంది కొనుగోళ్ల విషయంలో అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. దాదాపు 2 లక్షల క్వింటాళ్ల పంట దిగుబడులు వస్తాయని అంచనా వేసిన అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయ మార్కెట్‌యార్డుల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్క్‌ఫెడ్ అధికారులు జిల్లా కేంద్రంతో పాటు జైనథ్, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, బేల మార్కెట్‌యార్డుల్లో కంది పంటను కొనుగోలు చేయనున్నారు. జిల్లాలో ఇప్పటికే ఆదిలాబాద్, జైనథ్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాగా మిగితా చోట్ల త్వరలో ప్రారంభించనున్నారు. దీంతో రైతులకు తమ పంటలను దళారులు, వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోకుండా మార్క్‌ఫెడ్ కేంద్రాల ద్వారాలకు పంటను విక్రయించుకుని కనీస మద్దతు ధర పొందుతున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు మార్కెట్‌యార్డుల్లో కొనుగోళ్లను పరిశీలిస్తున్నారు. దళారులు మార్కెట్ రాకుండా సిబ్బందిని నియమించారు. రైతుల మాత్రమే తీసుకువచ్చిన పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా కంది పంట దిగుబడులు ప్రారంభం కాగా పంట కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా మార్కెట్‌యార్డుల్లో పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ సారి కంది దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరానికి ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వచ్చింది. సాధారణంగా పంట దిగుబడులు ఎక్కువగా ఉన్నప్పుడు రైతులకు దళారులు బెడద ఎక్కువగా ఉంటుంది. పంట నాణ్యత, తేమ పేరిట తూకంలో కోతలు విధిస్తారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో జిల్లా వ్యాప్తంగా దళారుల దందాకు బ్రేక్ పడింది.రైతులు కష్టపడి సాగుచేస్తున్న పంటలు దళారుల పాలు కాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. జిల్లా వ్యాప్తంగా వివిధ పంటల దిగుబడులు రైతులు నష్టపోకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌లోనూ కారు జోరు

బైంసాలో ఎగిరిన పతంగి ..ఎంఐఎం ఖాతాలోకి

గట్టి పోటీ ఇచ్చిన బిజెపి

ఆదిలాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): ఉమ్మడి జిల్లా మున్సిపాలిటీలో కారు జోరు కనిపిస్తోంది. అత్యధిక స్థానాల్లో స్థానాల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. నిర్మల్ మున్సిపాలిటీలో 42 వార్డులకు ఎన్నికలు జరిగాయి. మొదటి రౌండ్‌లో టీఆర్ఎస్ హవా కొనసాగింది. 21వార్డుల్లో లెక్కింపు పూర్తవగా 14 వార్డుల్లో టీఆర్ఎస్ అభ్యర్థుల విజయం సాధించారు. మూడు వార్డుల్లో కాంగ్రెస్, రెండు వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. అలాగే ఒక్కో వార్డులో బీజేపీ, ఎంఐఎం అభ్యర్థుల విజయం సాధించారు. మరో 21 వార్డులకు కౌంటింగ్ జరుగనుంది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీని టీఆర్ఎస్ కైవసం చేసుకుంది. బెల్లంపల్లి మొత్తం 36 వార్డులు ఉండగా.. టీఆర్ఎస్ 25, కాంగ్రెస్ 2, బీజేపీ 1, ఇండిపెండెంట్ 6 వార్డుల్లో గెలుపొందింది. ఇకపోతే బైంసా మున్సిపాలిటీని ఎంఐఎం పార్టీ కైవసం చేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో అధికార టీఆర్ఎస్ పార్టీ దూసుకుపోగా, బైంసాలో మాత్రం మిత్రపక్షమైన ఎంఐఎం దూసుకుపోయింది. టీఆర్ఎస్ మాత్రం ఒక్క స్థానంలోనూ గెలవలేకపోయింది. కాంగ్రెస్‌ది కూడా ఇదే పరిస్థితి. మొత్తం 26 వార్డుల్లో ఎంఐఎం 15, బీజేపీ 9, స్వతంత్ర అభ్యర్థులు 2 వార్డులను కైవసం చేసుకున్నాయి.

మోడీ, అమిత్ షాలో హిట్లర్ లక్షణాలు

–ఛత్తీస్‌ఘఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్

న్యూఢిల్లీ,జనవరి25(ఆర్ఎన్ఎ): జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలను ఛత్తీస్‌ఘఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ పోల్చారు. బీజేపీని ఏదైనా అనండి కానీ, భారత్‌ను విడగొట్టే వ్యాఖ్యలు చేస్తే మాత్రం జైలుకు పంపుతామంటూ ఇటీవల అమిత్ షా హెచ్చరించిన విషయం తెలిసిందే. అమిత్ షా వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఛత్తీస్‌ఘఢ్ సీఎం.. హిట్లర్ సైతం తనను ఎవరేమన్నా పర్వాలేదని, జర్మనీని మాత్రం అనడానికి వీల్లేదని తన ప్రసంగాల్లో చెప్పేవారని, 'మోటా భాయ్, ఛోటా భాయ్' సైతం అదే స్వరంతో, అదే భాషలో మాట్లాడుతున్నారని అన్నారు. జాతీయ పౌర రిజిస్టర్ అమలు చేస్తామని ఒకరు లేదని మరొకరు.. ఇందులో ఎవరు నిజమో ఎవరు అబద్ధమో తేల్చాలన్నారు. ఎన్ఆర్‌సీని అమలు చేస్తే మాత్రం వ్యతిరేకంగా సంతకం చేసే మొదటి వ్యక్తిని తానే అవుతానని బఘేల్ పునరుద్ఘాటించారు. ఎన్ఆర్‌సీ అమలు చేయడం వల్ల భూములల్లేని నిరుపేదలు, నిరక్షరాస్యులు ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

మానవాళికి సరికొత్త సవాల్ ..కరోనా వైరస్

హైదరాబాద్, జనరి 25:కొత్త కరోనా వైరస్ ఇప్పుడు ప్రపంచానికి సవాల్ విసురుతోంది. వైద్యపరంగా విజయాలు సాధిస్తున్న కొద్దీ కొత్త రోగాలు కొరకరాని కొయ్యగా మారుతున్నాయి. తొలుత ఎయిడ్స్, తరవాత క్యాన్సర్, స్వైన్‌ఫ్లూ, ఎబోలా లాంటి వైరస్‌లు మానవాళి మనుగడకు సవాల్‌గా మారాయి. వీటి పీడనుంచి ఇంకా బయటపడక ముందే తాజాగా చైనా కేంద్రంగా కరోనా వైరస్ అన్న మహమ్మారి తయారయ్యింది. ఈ వైరస్ బారిన పడితే ఇక అంతే సంగతులు. ఇప్పటికే అనేకమంది దీనిబారిన పడి మృత్యువాత పడ్డారు. అనేకులు మృత్యువుతో పోరాడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం చైనాలో ఇప్పటి వరకు 41మంది మృత్యువాత పడ్డారు. మొత్తంగా ఇది మెల్లగా ప్రపంచ దేశాలకు పాకుతోంది. దీంతో పరపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

కొత్తగా గుర్తించిన వ్యాధి కావడంతో అప్పుడే దీనికి సంబంధించి చికిత్స దక్కడం లేదు. చైనాలో గుర్తించిన ఈ వైరస్ చైనానే గాక, ఇరుగు పొరుగు దేశాలను కూడా వణికిస్తోంది. మధ్య చైనా రాష్ట్రం హ్యూబెయి లోని వుహాన్‌లో వెలుగుచూసిన ఈ వైరస్ అనతి కాలంలోనే హ్యూబెయిని ఆనుకుని వున్న రాష్ట్రాలతో సహా 29 రాష్ట్రాలకు పాకింది. అటు నుంచి హాంగ్‌కాంగ్, మకావు, తైవాన్, సింగపూర్, కొరియా, వియత్నాం, జపాన్, అమెరికాలతోబాటు భారత్‌కూ విస్తరించింది. ఇప్పటివరకు 830 కేసులను నిర్ధారించారు. ఈ కేసులను ప్రత్యేకంగా చూసేందుకు బీజింగ్‌లోని సార్స్ హాస్పిటల్ తరహాలో హ్యూబెయి లో వెయ్యి పడకలతో ప్రత్యేక ఆసుపత్రిని ప్రభుత్వం కేటాయించింది. చైనాలో పెద్దయెత్తున జరిగే నూతన వసంతోత్సవ సెలవులు రావడంతో ప్రవాస చైనీయులు పెద్ద సంఖ్యలో మాతృదేశానికి తరలి వస్తుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కరోనా వైరస్ తాకిడి ఎక్కువగా ఉన్న 29 రాష్ట్రాల్లో ప్రయాణాలు, పర్యాటకుల రాకపోకలపై ఆరోగ్య శాఖ లాక్‌డౌన్ ప్రకటించింది. లాక్ డౌన్ అంటే ఏ ప్రాంతం వారు ఆ ప్రాంతంలోనే ఇంటి పట్టున ఉండాలి. తప్పనిసరి అయితే తప్ప బయటకు వెళ్లాలంటే మాస్క్‌లు, ఇతర జాగ్రత్తలు తీసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో సంచారం దాదాపు నిషేధం. ఈ వైరస్‌ను చైనాలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించ కుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలను చైనా ఆరోగ్యశాఖ తీసుకుంటోంది. ఇంతవరకు ఈ వైరస్ బారిన పడి మృతి చెందినవారి సంఖ్య 26కు చేరింది. వ్యాప్తిని అడ్డుకునేందుకు వుహాన్ నగరానికి వచ్చే పర్యాటకులపై చైనా అధికారులు నిషేధం విధించారు. ఈ నిషేధాన్ని వుహాన్ పరిసర ప్రాంతాలకు కూడా విస్తరించారు. వుహాన్ నగరంలో ప్రజారవాణా బస్సులు, సబ్‌వేలు, ఫెర్రీలు, దూరప్రాంత రవాణా వాహనాల పై కూడా నిషేధం విధించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాలలో సంచరించే సమయంలో మాస్క్‌లు ధరించాలని వుహాన్‌నగరపాలక సంస్థ సూచించింది. చైనాను వణికిస్తున్న కరోనా వైరస్ ప్రపంచ దేశాలకూ మెల్ల మెల్లగా వ్యాపిస్తోంది. చైనా నుంచి ముంబయి, హైదరాబాద్, కేరళకు వచ్చిన పదిమందిని వైద్యులు ప్రత్యేకంగా పరీక్షిస్తున్నారు. తాజాగా ఈ ఇద్దరు వ్యక్తులకు దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపించడంతో వారిని కన్తార్బా ఆస్పత్రిలోని ప్రత్యేక వార్డులో ఉంచినట్లు బిఎంసి ఎగ్జిక్యూటివ్ వైద్యాధికారి పద్మజా కేస్కర్ వెల్లడించారు. చైనా నుండి తిరిగి వచ్చిన ప్రయాణికులకు దగ్గు, జలుబుకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే ఈ వార్డుకు పంపించాల్సిందిగా ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయ సిబ్బందిని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే ప్రైవేట్ వైద్యులు కూడా బిఎంసి అధికారులకు తెలియ జేయాలని కోరారు. తమ దేశంలో కరోనావైరల్ ఇన్ఫెక్షన్ కేసులు నమోదయినట్లు మీడియాలో వచ్చిన వార్తలను సౌదీ ఆరోగ్య మంత్రిత్వశాఖ తోసిపుచ్చింది. ఇప్పటి వరకూ తమ దేశంలో ఇలాంటి కేసులు నమోదు కాలేదని సౌదీ ఒక ట్వీట్‌లో స్పష్టం చేసింది. తమ దేశంలో ఈ ఇన్ఫెక్షన్ సోకిన విదేశీయులను స్వదేశాలకు పంపుతున్నట్లు వచ్చిన వార్తలను కూడా ఖండించింది. సౌదీ అరేబియా నైరుతి ప్రాంతంలోని ఒక ఆస్పత్రిలో పనిచేస్తున్న భారతీయ నర్స్‌కు ఈ ఇన్ఫెక్షన్ సోకినట్లు అంతకు ముందు భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సౌదీ సర్కారు ఈ వివరణ ఇచ్చింది. ప్రపంచాన్ని వణికిస్తున్న ఈ వైరస్‌ను అడ్డకునేందుకు తమ మంత్రిత్వశాఖ అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నదని, సంబంధిత వ్యవస్థలతో సమన్వయంతో తాము పరిస్థితులను గమనిస్తున్నామని పేర్కొంది. చైనా నుండి తమ దేశానికి వచ్చే ప్రయాణీకులందరినీ స్క్రీనింగ్ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, దీనితో పాటు ఇతర ముందస్తు చర్యలు కూడా తీసుకుంటున్నామని సౌదీ ప్రభుత్వం వివరించింది. చైనాలో ప్రబలిన కరోనా వైరస్ వ్యాప్తిపై ఇప్పుడు గ్లోబల్ హెల్త్ ఎమర్జన్సీని ప్రకటించడం తొందరపాటే అవుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్నది. అయితే చైనాతోబాటు ప్రపంచానికీ ఇది ముప్పుగా పరిణమించవచ్చు. ముందస్తు చర్యలు తీసుకున్నా వ్యాప్తిని అరికట్టలేమని అంటున్నారు. నివారణ చర్యలతో పాటు, అత్యాధునికి వైద్య చికిత్స అవసరంకానుంది. ప్రజలు కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. వ్యాధి లక్షణాలతో పాటు,ముందస్తు జాగ్రత్తలపై ప్రభుత్వం ప్రచారం చేయలి. ప్రజలకు మెచ్చరికలు చేయాలి. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తే మరీమంచిది.

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో విజయం సాధించడంపై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని అభినందించిన కార్యకర్తలు

నిజామాబాద్ కార్పోరేషన్‌లో బిజెపి సత్తా

గెలుపుదిశగా కాషాయదళం పయనం

భీంగల్‌లో టిఆర్ఎస్ విజయకేతనం

ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి వేముల

నిజామాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలలో బీజేపీ సత్తా చాటుతోంది. నిజామాబాద్‌లో మొత్తం 60 డివిజన్లు ఉండగా.. 30 డివిజన్లకు గాను మధ్యాహ్నం వరకు ఒకటో రౌండ్ ఫలితాలు వెలువడ్డాయి. మొదటి రౌండ్‌లో బీజేపీ అత్యధికంగా 17 స్థానాలను కైవసం చేసుకోగా... టీఆర్ఎస్ 6, ఎంఐఎం 3, స్వతంత్రులు ఒక స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. జిల్లాలోని భీంగల్ మున్సిపాలిటీలో టీఆర్ఎస్ విజయభేరి మోగించింది. మొత్తం 12 వార్డుల్లో టీఆర్ఎస్ పార్టీనే గెలిచింది. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ మున్సిపాలిటీలో టీఆర్ఎస్ గెలిచినందుకు భీంగల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎవరెన్ని అబద్దాలు చెప్పినా, రెచ్చగొట్టే ప్రకటనలు చేసినా ప్రజలు టీఆర్ఎస్ వైపే ఉన్నారని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వాన్ని బలపరిచి ఇంతటి ఘనవిజయాన్ని అందించి భీంగల్ ప్రజలకు రుణపడి ఉంటానని మంత్రి స్పష్టం చేశారు. భీంగల్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్ని నెరవేరుస్తాను.. 100 పడకల ఆస్పత్రి తీసుకువస్తానని అన్నారు. తన శక్తి మేరకు భీంగల్ అభివృద్ధి కోసం పని చేస్తానని మంత్రి చెప్పారు. కేటీఆర్ నేతృత్వంలో టీఆర్ఎస్ పార్టీని ప్రతి గడపకు, ప్రతి ఇంటికి తీసుకెళ్తామన్నారు. మున్సిపాలిటీలకు కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్ల నిధులు కేటాయించారు. ఆ అభివృద్ధి నిధులే టీఆర్ఎస్ విజయానికి దోహదపడ్డాయని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో టీఆర్ఎస్ క్లీన్‌స్వీప్ చేసేసింది. మొత్తం 12 వార్డులకు గాను.. ఒకటి ఏకగ్రీవం కాగా.. మిగిలిన 11 వార్డులను టీఆర్ఎస్ దక్కించుకుంది.

మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో విపక్షాలకు షాక్

సింగిల్ డిజిట్‌కే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ

హైదరాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. పట్టణ ఓటర్లంతా టీఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టారు. అనేక మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు టీఆర్ఎస్‌కు కనీస పోటీ ఇవ్వలేకపోయాయి. అత్యధిక మున్సిపాలిటల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు ఏకపక్ష విజయం సాధించారు. 120 మున్సిపాలిటీల్లో ఇప్పటి వరకు వెల్లడైన ఫలితాల్లో యాదగిరిగుట్ట, గద్వాల జిల్లా వడ్డేపల్లి(మొత్తం 10 వార్డులకు గాను కాంగ్రెస్ 8, టీఆర్ఎస్ 1, ఇతరులు ఒక స్థానం), నారాయణఖేడ్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఆమన్‌గల్‌లో బీజేపీ విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ రేవంత్ రెడ్డికి భారీ షాక్ తగిలింది. ఆయన గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొడంగల్‌లో కాంగ్రెస్‌కు చేదు ఫలితాలు వచ్చాయి. కొడంగల్ మున్సిపాలిటీలో అధికార టీఆర్ఎస్ హవా కొనసాగింది. మొత్తం 12 వార్డుల్లో గులాబీ పార్టీ 7 గెలుపొందగా, కాంగ్రెస్ కేవలం మూడు స్థానాలకు పరిమితమైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా రేవంత్ రెడ్డి కొడంగల్‌కు ఎక్కువ సమయం కేటాయించినప్పటికీ ఫలితం లేకపోయింది. టీఆర్ఎస్‌కు కనీసం పోటీ ఇవ్వలేకపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పునరావృత్తం చేస్తూ.. కొడంగల్ మున్సిపాలిటీలో టీఆర్ఎస్ విజయం సాధించింది. దీంతో కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రతిపక్షాలు కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయ్యాయి. దీంతో మెజార్టీ జిల్లాల్లో ఫలితాలు ఏకపక్షం అయ్యాయి. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల ప్రకారం మొత్తం 120 మున్సిపాలిటీల్లో 80కుపైగా టీఆర్ఎస్ విజయంసాధించింది. గద్వాల జిల్లా వడ్డేపల్లిలో కాంగ్రెస్ పార్టీ టీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చింది. మొత్తం 10 వార్డులకు గాను.. కాంగ్రెస్ పార్టీ 8 వార్డులను కైవసం చేసుకోగా.. టీఆర్ఎస్ ఒక స్థానంలో మాత్రమే విజయం సాధించింది. ఇండిపెండెంట్ అభ్యర్థి ఒక స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

ఇచ్చిన హామీమేరకు అభివృద్ధి చేస్తున్నాం

–అందుకే ప్రజలు టిఆర్ఎస్‌కు పట్టం కట్టారు

ఆదిలాబాద్,జనవరి 25(ఆర్ఎన్ఎ): ఇచ్చిన హామీ మేరకు ఐదు వందల జనాభా ఉన్న ప్రతి తండాను ప్రభుత్వం ప్రత్యేక పంచాయతీలుగా మార్చిందని, అందుకే పంచాయితీల్లో ప్రజలు టిఆర్ఎస్‌కు పట్టం కట్టారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజలు టిఆర్ఎస్ వెంట నడిచి సిఎం కెసిఆర్‌పై పూర్తి విశ్వాసం ప్రకటించారని అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు అన్ని మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. టిఆర్ఎస్ గెలవడంతో మరింత అభివృద్ధి సాధ్యమవు తుందని చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో సుభిక్షమైన పరిపాలన జరుగుతుందని, దేశం మొత్తం తెలంగాణ రాష్ట్రం వైపే చూస్తుందన్నారు. కేసీఆర్ ప్రజల్లో మమేకమై పరిపాలన కొనసాగిస్తూ వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అభివృద్ధి పథకాలను అమలు పరుస్తున్నారన్నారు. కొద్ది రోజుల్లో దేశంలోని అన్నిరాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రాన్ని ముందంజలో ఉంచడంలో సీఎం కేసీఆర్ సఫలీకృతులయ్యారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు, ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తూ సీఎం కేసీఆర్ ప్రజారంజక పాలనను అందిస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం మంత్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. అందుకే రాష్ట్రంలో కేసీఆర్ పాలనకు ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎంతగానో ఆకర్షితులవుతున్నారన్నారు. అభివృద్ధి కోసం విధివిధానాలు, ఆలోచనలో కేసీఆర్‌కు ఎవరూ సాటిలేరని ఉద్ఘోదించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాలు పూర్తయితే బీడుభూములన్నీ సస్యశ్యామలం చేయుటకు గోదావరి జలాలు ఉపయోగపడతాయని తెలిపారు.

మరుగుదొడ్ల లక్ష్యాన్ని చేరుకోవాలి

నోడల్ అధికారులదే పూర్తి బాధ్యత

భద్రాద్రి కొత్తగూడెం,జనవరి 25(

బంగారు తెలంగాణ దిశగా కేసీఆర్ యత్నాలు

మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు ఆశీర్వదించారు
విపక్షాల వాదనలను తిరస్కరించిన ప్రజలు
ఫలితాలు కేసీఆర్ అభివృద్ధి నమూనాకు నిదర్శనమన్న మంత్రి

వనపర్తి,జనవరి25(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ముఖ్యమంత్రి కేసీఆర్ పనితాననికి ఆయన విజన్‌కు నిదర్శనమని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని మరోమారు స్పష్టం అయ్యిందన్నారు. విపక్ష పార్టీల దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కూడా ఫలితాలు టిఆర్ఎస్‌కు అనుకూలంగా రావడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫలితాలు టిఆర్ఎస్‌కు అనుకూలంగా రావడంతో విమర్శలు కట్టిపెట్టాలని కాంగ్రెస్, బిజెపిలకు మంత్రి సేచించారు. తెలంగాణను బంగారు తెలంగాణగా రూపొందించేందుకు సిఎం కెసిఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే అభివృద్ధిలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కెల్లా మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకొస్తున్నారన్నారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఎన్నో ప్రధాన సమస్యలను పరిష్కరించి, మరిన్ని సమస్యలను పరిష్కరించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రాన్ని సీడ్‌హబ్‌గా తయారుచేసేందుకు ప్రభుత్వం అన్ని ప్రణాళికలు రూపొందిం చిందని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. రైతులకు, ప్రజలకు అవసరాలకు అనుగుణంగా పంటలు పండించేందుకు రైతాంగాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. రైతాంగం పంటల కోసం ప్రభుత్వం పెట్టుబడి రూపంలో ప్రతి ఎకరాకు రెండు పంటలకు రూ.10 వేలు అందించడంతో రైతులకు కూడా ఆసక్తి పెరిగిందన్నారు. రైతులు పండించిన పంట దళారుల చేతుల్లో మోసపోకుండా రైతుల సమన్వయ సమితులచే కొనుగోలు చేయించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. ప్రభుత్వ అభి వృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలకు, నాయకులకు ఉందన్నారు. పార్టీలో చేరుతున్న కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రైతుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుంద న్నారు. 24 గంటల విద్యుత్, రైతు సంబంధ సమస్యలతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుండడంతో పైరవీలకు తావులేకుం డా పోయిందని పేర్కొన్నారు. పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావడంతో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన సమస్యలతోపాటు విభజన సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. కృష్ణానది నీటితో చెరువులను నింపి చెరువు ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు అందించడమే టీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. మక్తల్ పెద్ద చెరువు ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంట చేతికి వచ్చేంత వరకు నీరు అందిస్తామని అన్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువ నుంచి మోటర్ల ద్వారా చెరువులోకి నీటి విడుదలను చేపట్టామని అన్నారు. 10ఏళ్ల తర్వాత చెరువు నింపడంతో రైతులు ఆనందోత్సహంతో యసంగి పంటను పూర్తి స్థాయిలో సాగు చేస్తుండడంతో పంట చేతికి వచ్చేంత వరకు చెరువులో నీరందదనే ఉద్దెశంతో రిజర్వాయర్ లెఫ్ట్ కెనాల్‌లో మోటర్లను ఏర్పాటు చేసి నిరంతరం చెరువులోకి నీటిని విడుదల

పట్టువీడని నిర్భయదోషులు

శిక్ష తప్పించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు
పటియాలా కోర్టులో మరో పిటిషన్

న్యూఢిల్లీ,జనవరి27(ఆర్ఎన్ఎ): ఉరి శిక్ష తప్పించుకునేందుకు నిర్భయ దోషులు చేయని ప్రయత్నం లేదు. న్యాయపరంగా ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటున్నారు. నలుగురు దోషులను ఫిబ్రవరి 1న ఉరితీయాల్సిందిగా ఇప్పటికే ఢిల్లీ పటియాలా హౌస్ కోర్టు రెండోసారి డెత్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. మరణ శిక్ష నుంచి తప్పించుకునేందుకు ఇప్పటికే వాళ్లు క్యురేటివ్, క్షమాభిక్ష పిటిషన్లు వేసుకొని సమయాన్ని వృథా చేయడంతో తొలిసారిగా ఇచ్చిన డెత్‌వారెంట్ గడువు ముగిసిపోయింది. ఈ నేపథ్యంలోనే మళ్లీ డెత్‌వారెంట్ జారీ చేశారు. దోషులు దాన్ని కూడా తప్పించు కునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నిర్భయ దోషులు మళ్లీ కోర్టుకెక్కారు. అక్షయ్ తరఫున న్యాయవాది ఏపీ సింగ్ ఢిల్లీ పటియాలా హౌస్ కోర్టులో పిటిషన్ వేశారు. దోషులు క్యురేటివ్, క్షమాభిక్ష పిటిషన్లు వేసేందుకు అవసరమైన పత్రాలను ఇవ్వడంలో తీహాడ్ జైలు అధికారులు ఆలస్యం చేశారని వారి తరఫు న్యాయవాది పిటిషన్‌లో పేర్కొన్నాడు. అందువల్లే ఆ ఇద్దరు దోషులు క్షమాభిక్ష పిటిషన్ వేసుకునేందుకు ఆలస్యమైందని న్యాయవాది ఆరోపించారు. దీనికి సంబంధించిన పిటిషన్ విచారణను కోర్టు శనివారం చేపట్టనుంది. డెత్ వారెంట్ జారీ అయిన తర్వాత వీళ్లిద్దరూ ఇప్పటి వరకు క్యురేటివ్, క్షమాభిక్ష పిటిషన్లు దాఖలు చేయలేదు. గతంలో పవన్ క్షమాభిక్ష పిటిషన్ వేసినట్లు వార్తలు వచ్చాయి.. కానీ అవి అసత్యమని తాను ఏ పిటిషన్ వేయలేదని అన్నాడు. ఇప్పటికే ముకేశ్ పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరస్కరించిన విషయం తెలిసిందే. పిటిషన్ వచ్చిన నాలుగు రోజుల వ్యవధిలోనే రాష్ట్రపతి దీన్ని తిరస్కరించి రికార్డు సృష్టించారు. ఇప్పటికే నిర్భయ దోషులకు ఉరి పక్రియలో జాప్యం జరుగుతోందంటూ విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. మరణశిక్ష పడిన దోషులు తమకు ఉన్న న్యాయపరమైన అవకాశాలు వినియోగించుకునేందుకు ఉన్న సమయాన్ని తగ్గించాలని కేంద్రం తన పిటిషన్ ద్వారా కోరింది.

డిస్కంల అభ్యంతరాలు పరిశీలించాలి

జస్టిస్ ధర్మాధికారి కమిటీకి సుప్రీం సూచన
అభ్యంతరాలను కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశం

న్యూఢిల్లీ,జనవరి25(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ డిస్కంల అభ్యంతరాలను పరిశీలించాలని జస్టిస్ ధర్మాధికారి కమిటీకి సుప్రీంకోర్టు సూచించింది. విద్యుత్ ఉద్యోగుల విభజనపై జస్టిస్ ధర్మాధికారి నివేదికను సవాల్ చేస్తూ ఏపీ డిస్కంలు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అశోక్‌భూషణ్, జస్టిస్ ఎం.ఆర్.షాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. రెండు వారాల్లో ఉద్యోగుల కేటాయింపులపై అభ్యంతరాలను ధర్మాధికారి కమిటీ ముందుకు తీసుకెళ్లాలని డిస్కంలకు ఆదేశించింది. సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని కమిటీకి చెప్పింది. ధర్మాధికారి కమిటీ కేటాయింపులను పక్కన పెట్టాలన్న ఏపీ డిస్కంల వాదనలను సుప్రీం తోసిపుచ్చింది. అభ్యంతరాలుంటే కమిటీకే తెలపాలని స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం 52:48 నిష్పత్తిలో ఉద్యోగులను విభజించాలని, అలాకాకుండా 655 మంది ఉద్యోగులను ఏపీకి కేటాయించడం ఆమోదయోగ్యం కాదని ఏపీ డిస్కంల తరఫున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీని వల్ల ఏపీపై భారం పడుతుందని అన్నారు. దీనిపై స్పందిస్తూ తాము ఆరేళ్లుగా ఉద్యోగులకు జీతాలు ఇచ్చామని తెలంగాణ తరఫు న్యాయవాది తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేయడం, ఏపీ డిస్కంలు చేర్చుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు.

మార్గదర్శి కేసులో ప్రతివాదిగా ఏపీ ప్రభుత్వం

సుప్రీంకోర్టు నిర్ణయం
విచారణ రెండు వారాలకు వాయిదా

న్యూఢిల్లీ,జనవరి25(ఆర్ఎన్ఎ): మార్గదర్శి ఫైనాన్షియర్స్ కుంభకోణం కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కూడా ప్రతివాదిగా చేర్చాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఛైర్మన్ రామోజీరావును కేసు నుంచి డిశ్చార్జ్ చేయడాన్ని సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ గతంలో పిటిషన్‌ను దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎంఆర్ షాతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. రిజర్వు బ్యాంకు ప్రత్యేక అధికారిని కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు సవరించిన మెమోను దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణకు రెండు వారాలకు వాయిదా వేసింది.

ఇదీ నేపథ్యం..

÷జర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం1934లోని సెక్షన్ 45(ఎన్) నిబంధనను ఉల్లంఘించి, దాదాపు రూ.2300 కోట్ల మేర డిపాజిట్లను సేకరించిందన్న అభియోగంపై ఇదే చట్టంలోని సెక్షన్ 45(టి), సెక్షన్ 58(ఇ) ఆధారంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై చర్యలు తీసుకునేందుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2006 డిసెంబర్ 19న ఉత్తర్వులు వెలువరించింది. మార్గదర్శి సంస్థ తాను సేకరించిన డిపాజిట్ల మొత్తంలో సగం విలువ మేరకు నష్టాలను కలిగి ఉందని వచ్చిన వార్తల నేపథ్యంలో డిపాజిటర్ల ప్రయోజనాల దృష్ట్యా ఈ వ్యవహారాన్ని పరిశీలించేందుకు అప్పటి ఆర్థిక శాఖ సలహాదారు ఎన్.రంగాచారిని నియమిస్తూ జీవో నెంబర్ 800 జారీచేసింది. అలాగే ఈ సంస్థపై ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(టి), సెక్షన్ 58(ఇ) కింద చర్యలు తీసుకునేందుకు వీలుగా న్యాయస్థానంలో కేసు ÷ల్ చేసేందుకు అప్పటి సీఐడీ ఐజీ కృష్ణ రాజును జీవో నెంబర్ 801 ద్వారా అధీకృత అధికారిగా నియమించింది. ఎన్.రంగాచారి ఇచ్చిన నివేదిక ఆధారంగా కృష్ణరాజు 23 జనవరి 2008న ఫస్ట్ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో సీసీ నెంబర్ 540 దాఖలు చేశారు. దీనిపై విచారణ నిలిపివేయాలని మార్గదర్శి పిటిషన్ దాఖలు చేసింది. 2010లో ఈ పిటిషన్‌ను ఆ న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ ఉత్తర్వులను పక్కనపెట్టాలని కోరుతూ తిరిగి 2011లో మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం సీసీ నెంబర్ 540లో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై స్టే ఇచ్చింది. అయితే ఏ కేసులోనైనా స్టే ఉత్తర్వులు ఆ రోజు నుంచి ఆరు నెలల తరువాత రద్దవుతాయని సుప్రీంకోర్టు 2018 మార్చి 28న తీర్పు వెలువరించింది. విచారణ కొనసాగించడం కంటే స్టే పొడిగించడమే అవశ్యమనుకున్న కేసుల్లో స్టే కొనసాగింపునకు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని పేర్కొంది. ఈ నేపథ్యంలో మార్గదర్శి సంస్థ స్టే పొడిగించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

కానీ స్టే పొడిగించేందుకు ధర్మాసనం నిరాకరించింది. దీంతో మార్గదర్శి హైకోర్టును ఆశ్రయించింది. 2011లో తాము దాఖలు చేసిన క్రిమినల్ పిటిషన్‌ను విచారించాలని అభ్యర్థించింది. దీనిని విచారించిన ఉమ్మడి హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ఉన్న క్రిమినల్ సీసీ నెంబర్ 540ని కొట్టివేసింది. దీనిపై ఉండవల్లి అరుణ్‌కుమార్ తరఫున న్యాయవాది అల్లంకి రమేశ్ ఇప్పుడు సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేశారు.

మేడారంలో మొదలయిన జాతర

అమ్మవార్లను గద్దెకి తీసుకుని రావడమే తరువాయి
జంపన్నవాగులో స్నానాలు చేస్తున్న భక్తులు

ములుగు,జనవరి 25(నేటినిజం ప్రతినిధి): మేడారంలోని సమ్మక్క దేవత, కన్నెపల్లిలోని సారలమ్మ దేవతల పూజా మందిరాల్లో మండమెలిగె పండుగను ఘనంగా నిర్వహించడంతో జాతరకు వేళయ్యింది. చిలకలగుట్ట నుంచి సమ్మక్కను, కన్నెపల్లి నుంచి సారలమ్మ దేవతలను తీసుకురా వడం మినహా మిగతా పూజాకార్యక్రమా లన్నీ నిర్వహించడంతో అమ్మవార్ల మహాజాతర ప్రారంభమైనట్లు పూజారులు ప్రకటించారు. సమ్మక్క దేవత గుడిలోని గద్దెను అలుకుపూతలు చేసి కుంకుమ, పసుపు, పిండితో ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. గతేడాది జరిగిన మినీ జాతర అనంతరం భద్రపరిచిన పూజా సామగ్రిని నీటితో శుద్ధి చేశారు. ఏటూరునాగారం మండలంలోని కొండాయి లో గోవిందరాజు గుడిలో పూజారులు మండమెలిగె పండగను నిర్వహించారు. మండమెలిగే పండగను పూజారులు నిర్వహించడంతో అమ్మవార్ల మహాజాతర అనంతరం వచ్చే తిరుగువారం వరకు రోజు పూజలు నిర్వహిస్తారు. రోజు అత్యంత నియమనిష్టలు పాటిస్తూ జాతర ముగిసే వరకు పూజలు నిర్వహించనున్నారు. తిరుగువారం పండుగ ముగిసిన తర్వాత అమ్మవార్ల పూజా సామగ్రిని భద్రపరిచి అమ్మవార్ల మందిరానికి పూజారులు తాళం వేస్తారు. తర్వాత రోజున పూజారులతో పాటు ఊరంతా వనభోజనాల కు తరలివెళ్లి ప్రకృతి దేవతలకు పూజలు నిర్వహిస్తారు. మేడారంలోని సమ్మక్క ఆలయం, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో సిద్ధబోయిన, చందా, కాక వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు నియమనిష్టతో అమ్మవార్ల మందిరాలకు చేరుకుని పూజాసామగ్రిని శుద్ధి చేశారు. గ్రామ దేవతలకు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం డోలు వాయిద్యాల నడుమ గ్రామ పొలిమేరకు చేరుకుని రెండువైపులా స్తంభాలను ఏర్పాటు చేసి పొలిపోసి దుష్టశక్తులు రాకుండా దిగ్బంధం చేశారు. తిరుగుపండుగ వరకూ అమ్మవార్లకు నిత్య పూజలు నిర్వహిస్తారు. జాతర ప్రారంభంతో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగే అవకాశం ఉంది. అమ్మవారి నుంచి పసుపు, కుంకుమ, పాలు, కల్లు, నీళ్లను తీసుకొని డోలివాయిద్యాల నడుమ గ్రామ శివారులో ఉన్న పోచమ్మ ఆలయానికి అమ్మవారికి నూతన వస్త్రాలను అలంకరించారు. ఆనాడు కాకతీయులు నిర్మించిన లక్నవరం సరస్సు మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే సుమారు కోటి మంది భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు నీటిని అందిస్తోంది. జాతర జరిగే నాలుగు రోజుల్లో ఆ ప్రాంతమంతా పులకరించనుంది. లక్నవరం నుంచి జంపన్న వాగు వరకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో జంపన్నవాగులో భక్తుల స్నానాలు చేసేందుకు ఆటంకం లేకుండా పోయింది. అటు రైతులకు రెండు పంటలకు నీరు అందిస్తూ, ఇటు పర్యాటకులను లక్నవరం ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ నీటితో పూర్తి స్థాయిలో నిండుకున్న సజ్జుమడుగు మత్తడి పోయగా ఆ నీరే దయ్యాలవాగు ద్వారా 25కిలోమీటర్ల మేర ప్రయాణించి మేడారం సమీపంలోని జంపన్నవాగుకు చేరుతుంది. దీంతో భక్తులు పుణ్యస్నానాలు చేస్తుంటారు. యేటా లక్నవరం సరస్సు పూర్తిస్థాయిలో నిండుకుని రెండు పంటలకు నీరు అందిస్తుందంటే నీటికి ఇబ్బంది లేకుండా పోతోంది. కాకతీయులు నిర్మించిన లక్నవరం సరస్సు ప్రతీ యేటా వర్షాకాలంలో పూర్తిస్థాయిలో నిండుకుని రైతులకు అండగా ఉంటోంది.

తెలంగాణలో భారీగా మొక్కలు నాటే కార్యక్రమం

దావోస్ పర్యటనలో వెల్లడించిన ప్రభుత్వం

హైదరాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం హరితహారం పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. రాష్ట్రాన్ని పచ్చదనంగా మార్చేందుకు భారీ సంఖ్యలో మొక్కలు నాటుతున్నట్లు మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హరితహారంలో భాగంగా సుమారు 230 కోట్ల మొక్కలు నాటేందుకు కట్టుబడి ఉందని మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్‌లో తెలిపారు. అమెరికాకు చెందిన క్లౌడ్ కంప్యూటింగ్ కంపెనీ సేల్స్‌ఫోర్స్ ఓనర్ మార్క్ బెనిఫ్‌కు ట్యాగ్ చేసిన ట్వీట్‌లో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. దావోస్‌లో జరుగుతన్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో వాతావరణ మార్పులపై ప్రపంచదేశాధి నేతలు కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రిలియన్ మొక్కలు నాటాలన్న సంకల్పం తీసుకున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఆధ్వర్యంలో 2021 నుంచి 2030 వరకు ట్రిలియన్ మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో మూడేళ్ల క్రితమే మొక్కలు నాటడం ప్రారంభమైందని, ఇప్పటికే 70 శాతం టార్గెట్‌ను చేరుకున్నామని మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని హరిత రాష్ట్రంగా మార్చాలన్న ఉద్దేశంతోనే టీఆర్ఎస్ ఎంపీ సంతోష్‌కుమార్ కూడా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేపట్టిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌కు విశేష స్పందన వస్తున్నది. అన్ని రంగాల సెలబ్రిటీలతో పాటు ప్రముఖులు మొక్కలు నాటుతూ మరో ముగ్గురికి సవాల్ చేస్తున్నారు.

కక్షతోనే అరిఫా హత్య

ప్లాన్ ప్రకారం అంతమొందించిన నిందితుడు
పోలీసుల ముందు లొంగిపోయిన దుండగుడు

హైదరాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): చిలకలగూడ వారాసిగూడలో ఆరిఫా అనే మైనర్ బాలిక హత్యకేసులో నిందితుడు షోయబ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. బాలికను ఏవిధంగా హత్య చేశాడో నిందితుడు అంతా వివరించాడు. ఆరిఫా తల్లిదండ్రులు అనుకున్నట్లుగానే షోయబ్‌నే ఆరిఫాను హత్య చేశాడు. గతంలో ఆరిఫాను పెళ్లి చేసుకుంటానని ఆమె తల్లిదండ్రులను షోయబ్ అడిగాడు. ఇందుకు వారు నిరాకరించారు. అప్పటి నుంచి ఆరిఫాపై కోపం పెంచుకున్న షోయబ్.. ఏకాంతంగా ఎప్పుడు దొరుకుతుందా అని ఎదురుచూశాడు. గురువారం రాత్రి బిల్డింగ్ పైకి చదువుకోవడానికని ఆరిఫా వెళ్లింది. ఇదే సమయం అదునుగా భావించిన షోయబ్.. ఆమెను కొట్టి చంపి, బిల్డింగ్ పై నుంచి తోసేశాడు. కాగా.. ఆరిఫా మృతదేహానికి వైద్యులు ప్రైమరీ పోస్టుమార్టం నిర్వహించారు. ఆమె శరీరంపై 11 గాయాలు ఉన్నట్లు గుర్తించారు.

ఏడుపాయలకు పోటెత్తిన భక్తులు

మెదక్,జనవరి25(నేటినిజం ప్రతినిధి): దేశంలోనే రెండో వనదుర్గామాత ఆలయంగా ప్రసిద్ధి చెందిన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. చెక్‌డ్యాం వద్ద, అమ్మవారి ప్రధాన ఆలయం ముందున్న మంజీరా నదీపాయలో భక్తులు మాఘ స్నానాలు ఆచరించి వనదుర్గామాత దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మౌని అమావాస్యకావడంతో భక్తులు పోటెత్తారు.

స్టార్ కాంపెయినర్ లిస్టులో చోటులేని సంజయ్

న్యూఢిల్లీ,జనవరి25(ఆర్ఎన్ఎ): ఫిబ్రవరి 8న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే స్టార్ క్యాంపెయిన్ల జాబితాను ప్రకటించింది. అయితే స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో కాంగ్రెస్ సీనియర్ నేత సందీప్ దీక్షిత్ పేరు లేదు. పార్టీ నేతలతో వచ్చిన కొన్ని విభేదాల కారణంగా స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో తన పేరు లేదని ఈ సందర్భంగా సందీప్ దీక్షిత్ అన్నారు. ఈ విషయమై ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఢిల్లీ కాంగ్రెస్‌ను ఏఐసీసీ స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సుభాష్ చోప్రాతో నేనే మి మాట్లాడలేదు. ఆయన దగ్గర నుంచి నాకు పిలుపు వస్తుందనుకోవడం లేదు. ఢిల్లీలో జరుగుతున్న సమస్యలపై నాకు అవగాహన లేదు. నేను పార్టీలో పెద్ద నేతను కాదంటూ పార్టీ అధిష్టానానికి చురకలంటించారు.

ఎన్నికలు అంటే డబ్బు, మద్యం

వ్యవస్థలను భ్రష్టు పట్టించిన టిఆర్ఎస్
స్వేచ్ఛగా ఎన్నికలు జరగలేదు: భట్టి

ఖమ్మం,జనవరి25(ఆర్ఎన్ఎ): ఎన్నికలు అంటే మద్యం, డబ్బులు అనేవిధంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అధికార టీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ శాసనసభా పక్షనేత భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. సామాన్యులు, మధ్యతరగతి వారు రాజకీయాల్లో పాల్గొనకుండా, మద్యం వ్యాపారులు, ఓట్లను కొనుగోలు చేసేవారు మాత్రమే రాజకీయాలు చేసే విధంగా వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఖమ్మంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. అందులో మున్సిపల్ ఎన్నికలు టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య జరిగిన ఎన్నికలు కావన్నారు. ఇవి ప్రజాస్వామ్య ఎన్నికలు కానే కావని విమర్శించారు.

విచ్చలవిడి మద్యం, విపరీతమైన డబ్బులు, ప్రలోభాలకు, ప్రజాస్వామ్యమైన కాంగ్రెస్ పార్టీకి మధ్య జరిగిన ఎన్నికలని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన అవినీతి, అక్రమాలతో కూడగట్టిన వేలకోట్ల రూపాయలతో ఓటు విలువను దిగజార్చే కుట్ర చేస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. ప్రజాస్వామ్యంపై ఉక్కుపాదం మోపి సామాన్యులను రాజకీయాలకు దూరం చేసే కుట్రలో భాగంగా విచ్చలవిడిగా డబ్బులు పంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలను కలుషితం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను పాతర వేస్తున్నవారి నుంచి రాజకీయాలను కాపాడాలని కోరారు. అందుకోసం మేధావులు, ప్రజాస్వామిక వాదులు, చైతన్యవంతులు అందరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. పెద్ద ఎత్తున దుర్మార్గాలు, దౌర్జన్యాలు, డబ్బులు, మద్యం పంపిణీ జరిగినా.. మొక్కవోని ధైర్యంతో టీఆర్ఎస్ నేతల ఆగడాలను అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయేది కాంగ్రెస్ పార్టీయేనని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు.

డిజిటల్ యాప్‌తో నగదు విత్‌డ్రా

-అదుబాటులోకి తెచ్చిన ఫోన్‌పే

న్యూఢిల్లీ ,జనవరి25(ఆర్ఎన్ఎ):ప్రముఖ డిజిటల్ వాలెట్ యాప్ ఫోన్‌పే తన వినియోగదారులకు ఓ సరికొత్త ఫీచర్‌ను తాజాగా అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు ఇకపై ఫోన్‌పే యాప్ ద్వారా నగదు విత్‌డ్రా చేసుకోవచ్చు. అందుకు గాను వారు తమ ఫోన్ పే యాప్‌లో ఉండే విత్‌డ్రా క్యాష్ ఆప్షన్‌ను ఎంచుకుని తమకు కావల్సిన మొత్తాన్ని అందులో ఎంటర్ చేసి దాన్ని వ్యాపారికి ట్రాన్స్‌ఫర్ చేయాలి. దీంతో వ్యాపారి ఆ మొత్తానికి చెందిన నగదును వినియోగదారుడికి ఇస్తాడు. ఈ క్రమంలో వినియోగదారులు ఈ విధానం ద్వారా నిత్యం రూ.1వేయి వరకు వ్యాపారుల వద్ద నగదు విత్‌డ్రా చేసుకోవచ్చు. కాగా ప్రస్తుతం ఈ సదుపాయం కేవలం ఢిల్లీలోని ఫోన్‌పే కస్టమర్లకు మాత్రమే అందుబాటులోకి రాగా.. త్వరలోనే దేశవ్యాప్తంగా ఫోన్‌పే ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తేనుంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కారు రివర్స్ తీస్తుండగా బాలుడు బలి

హైదరాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ములుగు మండలం బండమైలారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. యువకులు ప్రయాణిస్తున్న బైక్‌ను వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులను కొక్కొండకు చెందిన కుమార్, స్వామిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నగరంలోని మల్కాజ్‌గిరి ఆనంద్‌బాగ్‌లోనూ రోడ్డుప్రమాదం జరిగింది. వెంకట్ ప్లాజా అపార్ట్‌మెంట్‌లో కారు రివర్స్ తీస్తుండగా.. మూడు సంవత్సరాల బాలుడు కారు చక్రాల కింద పడిపోయాడు. దీంతో ఆ బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మల్కాజ్‌గిరి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఇరాక్‌పై వైమానిక దాడి

అమెరికా సంకీర్ణ దళాల పనేనని అనుమానం

బాగ్దాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): ఇరాక్‌లోని అల్-ఖైమ్ పట్టణంలో వైమానిక దాడులు జరిగాయి. ఇరాన్ మద్దతు ఉన్న హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయమే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు కొన్ని అరబ్ మీడియా కథనాల

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో టీఆర్ఎస్ స్వీప్

జగిత్యాలలో టీఆర్ఎస్ సంబరాలు

జగిత్యాల, సిరిసిల్ల,జమ్మికుంట, ధర్మపురిలల్లో విజయబావుటా
సిరిసిల్లలో సత్తా చాటిన స్వతంత్రులు

కరీంనగర్,జనవరి25(నేటినిజం ప్రతినిధి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కారు జోరు కనిపించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అధికార పార్టీ క్లీన్‌స్వీప్ చేసింది. 14 మున్సిపాలిటీ అన్నింటిలోనూ గులాబీ పార్టీ తన జెండాను ఎగురవేసింది. జగిత్యాలలో తొలిసారి టీఆర్ఎస్ విజయం సాధించింది. సిరిసిల్లలో ఇండిపెండెంట్లు సత్తా చాటి,పది మంది స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. అయినా గెలుపు మాత్రం టిఆర్ఎస్ పక్షాన నిలిచింది. సిరిసిల్లలో మొత్తం 39 వార్డులకు ఓట్ల లెక్కింపు ముగియగా టీఆర్ఎస్ 24 వార్డుల్లో గెలిచింది. బీజేపీ అభ్యర్థులు 3, కాంగ్రెస్ అభ్యర్థులు 2 స్థానాలు దక్కించుకోగా, స్వతంత్ర అభ్యర్థులు 10 స్థానాల్లో గెలుపొందారు. ఇకపోతే మంత్రుల ఇలాఖాలో టిఆర్ఎస్ గెలిచింది. ధర్మపురి, జమ్మికుంటలు కూడా గులాబీగూటికి చేరాయి. జిల్లాలోని దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో దూసుకుని పోతోంది. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జగిత్యాల జిల్లా ధర్మపురిలో టిఆర్ఎస్ విజయం నమోదు చేసింది. మొత్తం 15 వార్డుల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య నువ్వా - నేనా? అన్నట్టుగా పోరు కొనసాగగా 8స్థానాలతో విజయాన్ని టిఆర్ఎస్ తన ఖాతాలో వేసుకుంది. జగిత్యాలలో టీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. 48 స్థానాలకుగాను 30 చోట్ల టీఆర్ఎస్ విజయం సాధించింది. 7 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించగా, 7 స్థానాలను ఇండింపెండెట్లు, మూడు స్థానాలను బీజేపీ, ఒకచోట ఎంఐఎం గెలుపొందింది. జగిత్యాల బల్దియాపై తొలిసారిగా గులాబీ జెండా రెపరెపలాడనుంది. టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు,మంత్రి కేటీఆర్ సొంత నియోజకవర్గం సిరిసిల్లలో స్వతంత్ర అభ్యర్థులు హవా కొనసాగింది. స్వతంత్రులు ఏకంగా 10 మంది గెలిచారు. టీఆర్ఎస్ గెలుపు కోసం అన్ని ప్రాంతాల్లో కేటీఆర్ ప్రచారం నిర్వహించారు. కానీ సొంత నియోజకవర్గంలో మాత్రం ఆయన ప్రభావం అంతంత మాత్రంగానే ఉంది. మిగతా మున్సిపాలిటీల్లో కారు స్పీడ్‌గా దూసుకుపోతోంది. సిరిసిల్లలో మాత్రం కేటీఆర్ సత్తా చాటలేకపోయారు. మొత్తం 39 వార్డులకు ఓట్ల లెక్కింపు ముగియగా టీఆర్ఎస్ 24 వార్డుల్లో గెలిచింది. బీజేపీ అభ్యర్థులు 3, కాంగ్రెస్ అభ్యర్థులు 2, స్వతంత్రులు 10 స్థానాల్లో గెలుపొందారు. వీరు టీఆర్ఎస్ రెబల్స్‌గా తెలుస్తోంది. సిరిసిల్లలో మొత్తం వార్డులన్నీ టీఆర్ఎస్సే కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ నేతలు భావించారు. కానీ అనూహ్యంగా స్వతంత్రులు దెబ్బకొట్టారు. దాదాపు 10 మంది స్వతంత్రులు ఇక్కడ గెలుపొందారు. ఈ 10 మంది కూడా టీఆర్ఎస్ రెబల్స్ కావడం విశేషం. పెద్దపల్లి మునిసిపల్ ఎన్నికల ఫలితాలు పలు చోట్ల హోరాహోరా పోరును సాగిస్తున్నాయి. ఇప్పటికే రామగుండంలోనూ అలాంటి పరిస్థితే కొనసాగుతోంది. అధికార టీఆర్ఎస్ పార్టీకి విపక్షాలన్నీ కలిసి తీవ్ర స్థాయిలో పోటీనిస్తున్నాయి. 4, 5, 7, 15, 30,33 డివిజన్లలో టీఆర్ఎస్ ముందంజలో ఉంది. 8, 42, 50 డివిజన్లలో ఫార్వార్డ్ బ్లాక్, 26వ డివిజన్‌లో బీజేపీ, 29వ డివిజన్‌లో కాంగ్రెస్ ముందంజలో ఉన్నాయి. జమ్మికుంట మున్సిపాలిటీలో 30 వార్డులకుగాను టీఆర్ఎస్-22, కాంగ్రెస్-3, ఇతరులు-5 వార్డల్లో గెలుపొందారు. హుజూరాబాద్(30) మున్సిపాలిటీలో 30 వార్డులకుగాను టీఆర్ఎస్-20, కాంగ్రెస్-1, బీజేపీ-5, ఇతరులు-3 స్థానాల్లో గెలుపొందగా మరో వార్డు ఫలితం వెల్లడి కావాల్సి ఉంది. చొప్పదండి మున్సిపాలిటీలోని 14 వార్డుల్లో టీఆర్ఎస్-9, కాంగ్రెస్-2, బీజేపీ-2, ఇతరులు-1 స్థానంలో గెలుపొందారు. కొత్తపల్లి మున్సిపాలిటీలోని 12 వార్డులకుగాను టీఆర్ఎస్ 11 వార్డులను కైవసం చేసుకోగా కాంగ్రెస్ పార్టీ ఒక వార్డులో గెలుపొందింది.

ఫలించిన హరీష్ రావు మంత్రాంగం
ఉమ్మడి జిల్లాలలో 13 మున్సిపాలిటీలు కైవసం

మెదక్,జనవరి25(ఆర్ఎన్ఎ): ఉమ్మడి మెదక్ జిల్లాలో టీఆర్ఎస్ విజయ దుందుభీ మోగించింది. మంతరి హరీష్రావు మంత్రాంగం ఫలించింది. దీంతో మొత్తం 14 మున్సిపాలిటీల్లో 13 చోట్ల టీఆర్ఎస్ విజయం సాధించింది. నారాయన్‌ఖేడ్ మున్సిపాలిటీని కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. ఫలితాలపై గులాబీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సంబరాలు చేసుకుంటున్నారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సంగారెడ్డితో పాటు సదాశివపేట మున్సిపాలిటీలను గులాబీ పార్టీ సొంతం చేసుకుంది. రెండు మున్సిపాలిటిల్లోనూ జగ్గారెడ్డికి ఓట్లర్లు దిమ్మతిరిగే రీతిలో షాక్ ఇచ్చారు. సంగారెడ్డిలో ఇప్పటి వరకు టీఆర్ఎస్‌కు మంచి ఫలితాలు రాలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గాన్ని టీఆర్ఎస్ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించింది. అయినా కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి విజయం సాధించారు. దీంతో మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే పట్టుదలతో టీఆర్ఎస్ బరిలోకి దిగింది. దీనికి అనుగుణంగానే సీఎం కేసీఆర్ మంత్రి హరీష్ రావుకు సంగారెడ్డి, సదాశివపేట బాధ్యతలు అప్పగించారు. దీంతో హరీష్ మొదటి నుంచీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ.. పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. దీనికి తగట్టుగానే హస్తం అభ్యర్థులను మట్టికరిపిస్తూ సంగారెడ్డిపై గులాబీ జెండా ఎగరేశారు.

అమరచింతలో ఇండిపెండెంట్ల విజయం

వనపర్తి,జనవరి25(ఆర్ఎన్ఎ): జిల్లాలో కొన్ని మునిసిపాలిటీలు ఫలితాలు చాలా ఆసక్తికరంగా వెలువడుతున్నాయి. వనపర్తి జిల్లా అమరచింతలో ఊహకందని ఫలితం వెలువడింది. ఇక్కడ మొత్తం పది స్థానాలు ఉండగా.. స్వతంత్ర అభ్యర్థులు ఏకంగా ఐదు స్థానాల్లో విజయం సాధించారు. అధికార టీఆర్ఎస్ పార్టీ మూడు స్థానాలను కైవసం చేసుకోగా.. కాంగ్రెస్ 1, బీజేపీ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. దీంతో ఇక్కడ అధికార పీఠాన్ని ఏ పార్టీ దక్కించుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయపతాకావిష్కరణ

నేటి గణతంత్ర దినోత్సవానికి భారీభద్రత
జెండా ఆవిష్కరించనున్న గవర్నర్ తమిళసై

హైదరాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): తెలంగాణ అవతరణ వేడుకల్లాగానే గణతంత్ర వేడుకలనునాంపల్లిలోని పబ్లిక్‌గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. ఆదివారం జరుగనున్న గణతంత్ర వేడుకల సందర్భంగా నగర పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేసారు. గవర్నర్ తమిళసై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భద్రతా ఏర్పాట్లను నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ స్వయంగా పర్యవేక్షించారు. రిపబ్లిక్‌డే పరేడ్ జరిగే పబ్లిక్ గార్డెన్స్‌ను పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. ప్రస్తుతం ప్రత్యేక బాంబు నిర్వీర్య బృందాలతో అడుగడుగునా తనిఖీలు నిర్వహించారు. శనివారం జరిగే రిహార్సల్స్‌ను వీక్షించే ఉన్నతాధికారులు భద్రతా చర్యల్లో తీసుకోవాల్సిన మార్పు చేర్పులను సూచిస్తారు. పబ్లిక్ గార్డెన్స్‌తో పాటు ఆ చుట్ట పక్కల ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. పెట్రోలింగ్ నిర్వహించడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. శాంతిభద్రతల విభాగంతో పాటు టాస్క్‌ఫోర్స్, సిటీ సెక్యూరిటీ వింగ్, సీఏఆర్ విభాగాలు, సాయుధ బలగాలు బందోబస్తులో పాల్గొనున్నాయి. దాదాపు 1500 మంది సిబ్బందిని ఇక్కడ మోహరిస్తున్నారు. నగర వ్యాప్తంగా నిఘా, తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు పెద్ద ఎత్తున మఫ్టీ పోలీసులను మోహరించారు. పబ్లిక్ గార్డెన్స్‌కు దారి తీసే రహదారుల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు ప్రధాన ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేయనున్నారు. పరేడ్‌ను వీక్షించడానికి వచ్చే ప్రజలు తమ వెంట హ్యాండ్ బ్యాగ్స్, కెమెరాలు, టిఫిన్ బాక్సులు, బ్రీఫ్ కేసులను తీసుకురావడాన్ని నిషేధించారు. బందోబస్తు చర్యల్లో భాగంగా ఈసారి గగనతలంపై నుంచి కూడా నిఘా ఏర్పాటు చేశారు. రూఫ్ టాప్ వాచ్ కోసం ఎత్తయిన బిల్డింగ్స్‌పైన సుశిక్షితులైన సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. గణతంత్య వేడుకల నేపథ్యంలో తాజ్ ఐలాండ్, ఛాపెల్ రోడ్ 'టీ' జంక్షన్, సైఫాబాద్ పాత పోలీస్ స్టేషన్, బషీర్‌బాగ్ జంక్షన్, ఇక్బాల్ మీనార్, ఏఆర్ పెట్రోల్ పంప్, ఆదర్స్‌నగర్ వద్ద ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. ఈ పాయింట్స్ దాటి సాధారణ ట్రాఫిక్‌ను పబ్లిక్ గార్డెన్స్ వైపు అనుమతించరు. ఆదివారం జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు. భద్రతలోభాగంగానే ఇలాంటి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైనప్పుడు పోలీసులు తనిఖీలు నిర్వహిస్తారని, విధి నిర్వాహణలో ఉన్న పోలీసులకు ప్రజలు సహకరించాలని సీపీ సూచించారు.

భైంసాలో ఎంఐఎం రెండోసారి విజయం

గట్టి పోటీ ఇచ్చిన బిజెపి
ఖాతా తెరవని కాంగ్రెస్, టిఆర్ఎస్

నిర్మల్,జనవరి25(ఆర్ఎన్ఎ): జిల్లాలోని భైంసా మున్సిపాలిటీలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం విజయం సాధించింది. ఎన్నికల ముందు తీవ్ర ఘర్షణలతో వార్తల్లో నిలిచిన భైంసాలో పుర పోరు ఉత్కంఠ భరితంగా సాగిన విషయం తెలిసిందే. విజయం కోసం ఎంఐఎం, బీజేపీ తీవ్రంగా పోటీపడ్డాయి. భైంసా మున్సిపాలిటీలో మొత్తం 26 వార్డుల్లో ఎంఐఎం 15 గెలుపొందగా, బీజేపీ 9 స్థానాల్లో విజయం సాధించింది. స్వతంత్రులు రెండు వార్డులను సొంతం చేసుకున్నారు. అధికార టీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ మాత్రం కనీసం పోటీలో కూడా లేకుండా పోయాయి. గత ఎన్నికల్లోనూ

భైంసా మున్సిపాలిటీలో సొంతం చేసుకున్న ఎంఐఎం మరోసారి అదే ఫలితాలను అనూహ్యంగా పుంజుకుని 9 వార్డుల్లో విజయం నమోదు చేసింది. పునరావృత్తం చేసి పట్టునిలుపుకుంది. అయితే బీజేపీ మాత్రం ఈ ఎన్నికల్లో

నిర్భయ దోషులకు కట్టుదిట్టమైన భద్రత

ఆత్మహత్య చేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ
ఫిబ్రవరి 1న ఉరికి అంతా సిద్ధం చేసిన తీహార్ అధికారులు

న్యూఢిల్లీ,జనవరి25(ఆర్ఎన్ఎ): తీహార్ జైలు.. మొత్తం 18,000 బందీలు. వీరిలో అత్యధిక భద్రత కల్పించింది మాత్రం ఉరికంబం ఎక్కబోతున్న నిర్భయ దోషులకు. ముంబయి గ్యాంగ్‌స్టర్ ఛోటా రాజన్, దిల్లీ డాన్ నీరజ్ బవానా, బిహార్ నేరస్తుడు షహబుద్దీన్ తదితరులు ఇక్కడే శిక్ష పొందుతున్నారు. ఫిబ్రవరి 1న ఉరితీయనున్న నిర్భయ దోషులు ముకేశ్ సింగ్ (32), పవన్ కుమార్ గుప్తా (25), అక్షయ్ ఠాకూర్ (31), వినయ్ శర్మ (26)లకు మాత్రం భద్రతను పెంచారు. ఫిబ్రవరి 1న వీరికి ఉరి శిక్ష అమలు చేయనున్న నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నిర్భయ దోషులను తీహార్ జైలులోని మూడో నంబరు గదికి జనవరి 16న తరలించారు. ఆయా గదుల్లో ఒక్కొక్కరిని విడివిడిగా ఉంచారు. వారు ఆత్మహత్య చేసుకోకుండా నిరంతరం కాపలా కాస్తున్నారు. ఆ జైలుగదిలో ఏ విధమైన రెయిలింగ్‌లు, రాడ్లు ఉండవు. వీరున్న ప్రతి జైలు గది దగ్గర ఇద్దరు గార్డ్‌లు 24 గంటలూ కాపలా ఉంటారు. గదుల్లో అటాచ్డ్ టాయిలెట్స్ ఉన్నాయి. అక్కడ కూడా వారిపై నిఘా ఉంచేలా ఏర్పాట్లు ఉన్నాయి. వారి గదుల్లో నిషేధిత వస్తువులు ఉన్నాయా అని రోజుకు రెండు సార్లు గార్డులు పరిశీలిస్తారు. ఇవన్నీ కాకుండా ప్రతీ గదిలో రెండు సీసీ టీవీ కెమేరాలుంటాయి. జైలు సూపరింటెండెంట్ కార్యాలయం లోని కంట్రోల్ రూం నుంచి నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. వారిని ప్రస్తుత గదులకు తరలించే ముందే దోషులు తమను తాము గాయపరచుకోవటానికి వీలు లేకుండా.. గదిలో గోడకు మేకులు, ఎలాంటి లోహపు వస్తువులు లేకుండా నిశిత పరిశీలన జరిగింది. దోషులు తమను తాము గాయపరుచుకోవడానికి తలను గోడకు కొట్టుకోవటం ఒకటే అవకాశం ఉంది. ఉరితీత అమలును వాయిదా వేయటానికి కొంతమంది ఇలా చేస్తారు. అయితే వీరు అలాచేస్తే సెకన్లలోనే వారి ప్రయత్నాలను నిలువరించేలా ఏర్పాట్లు చేశారు. ఈ కేసులో మరో నిందితుడైన రామ్ సింగ్, మార్చి 11, 2013న ఇదే జైలు జనరల్ వార్డ్‌లోని 3వ నంబరు గదిలో ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఏ చిన్న పొరపాటు జరిగినా ఉన్నత స్థాయి ఉద్యోగులకు ముప్పు వచ్చే అవకాశముందని సీనియర్ జైలు అధికారి ఒకరు తెలిపారు. దోషులను ప్రతిరోజూ జైలు వైద్యులు పరిశీలించి హెడ్‌క్వార్టర్స్‌కు నివేదిక పంపుతారు. పవన్ తప్ప మిగిలిన ముగ్గురూ ఆందోళన చెందినట్టు కనపడలేదు. బహుశా ఉరితీత మళ్లీ వాయిదా పడుతుందని వారు అనుకుంటున్నారు. ఐతే పవన్ కుమార్ కొన్నిసార్లు ఆహారం తీసుకోవటం లేదని వివరించారు. ఉరితీతపై దోషులు పెట్టుకున్న పిటిషన్లను దిల్లీ కోర్టు ఈరోజు కొట్టివేసింది. ఫిబ్రవరి 1న ఉదయం ఆరు గంటలకు నలుగురు దోషులను ఉరి తీయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ దర్శకుడు సుశీంద్రన్

చెన్నై,జనవరి25(ఆర్ఎన్ఎ): తమిళ దర్శకుడు సుశీంద్రన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సప్తగిరి ఎల్ఎల్‌బీ దర్శకుడు చరణ్ లక్కాకుల ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సంగతి తెలిసిందే.

ఆయన తృటిలో పెద్ద ప్రమాదం నుండి తప్పించుకున్నాడు. ఈ సంఘటన మరచిపోకముందే సుశీంద్రన్ వాకింగ్‌కి వెళుతుండగా బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి సుశీంద్రన్‌ని బలంగా ఢీకొట్టారు. దీంతో కిందపడ్డ అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. సుశీంద్రన్‌ని పరీక్షించిన వైద్యులు చేయి విరిగిందని చెప్పారు. శరీరంలో మిగతా భాగాలకి తీవ్రగాయాలు అయిన నేపథ్యంలో వారం రోజుల పాటు సుశీంద్రన్‌ని ఆసుపత్రిలో ఉంచి చికిత్స అందించనున్నట్టు వైద్యులు తెలిపారు. సుశీంద్రన్ యాక్సిడెంట్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. గత ఏడాది సుశీంద్రన్ దర్శకత్వంలో రూపొందిన కెనడీ క్లబ్, చాంఫియన్ సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి.

ఇద్దరికి శౌర్యచక్ర అవార్డులు ప్రకటించిన కేంద్రం

మరణానంతరం సోంబీర్‌కు దక్కిన గౌరవం

న్యూఢిల్లీ,జనవరి25(ఆర్ఎన్ఎ): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వనివారం కేంద్ర ప్రభుత్వం శౌర్యచక్ర అవార్డులను ప్రకటించింది. జాట్ రెజిమెంట్‌లో ఉన్న నాయక్ సుబేదార్ సోంబిర్‌కు.. మరణాణంతరం శౌర్య చక్రను ప్రకటించారు. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఆపరేషన్‌లో సుబేదార్ సోంబిర్.. ఉగ్రవాదులను తుదముట్టించారు. గత ఏడాది మణిపూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులను చంపిన లెఫ్టినెంట్ కల్నల్ జ్యోతి లామాకు కూడా శౌర్యచక్ర ప్రకటించారు. 14 మంది ఉగ్రవాదులను అరెస్టు చేయడంలో అతను కీలక పాత్ర పోషించారు. లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద కీలక ఆపరేషన్ చేపట్టిన సిపాయ్ కర్మ్ డియో ఓరన్ కూడా శౌర్య చక్ర గెలుచుకున్నారు. తనకు బుల్లెట్ దిగినా.. ఉగ్రవాదులపై తొమ్మిది గ్రేనేడ్లు వదిలి, ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చారు. ఆర్మీకి చెందిన ఐదుగురికి శౌర్య చక్ర దక్కింది. రేపు ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో శౌర్య చక్ర పతకాలను అందజేస్తారు. పారాచూట్ రెజిమెంట్‌కు చెందిన నాయిబ్ సుబేదార్ నరేంద్ర సింగ్‌కు కూడా శౌర్య చక్రను ప్రకటించారు. లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద నరేంద్ర సింగ్ ఇద్దరు ఉగ్రవాదులను చంపేశారు. ఆర్మీ పోస్టుపై దాడి చేసేందుకు వచ్చిన ఉగ్రవాదులను అతను హతమార్చారు.

మున్సిపల్ ఎన్నికలు కెటిఆర్‌కు చెంపదెబ్బ
సిరిసిల్లలో రెబల్స్ గెలవడం సిగ్గుచేటు
బిజెపి ఎక్కడుందన్న ఆయనకు ఫలితాలే నిదర్శనం: లక్ష్మణ్

హైదరాబాద్,జనవరి25(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ఫలితాలు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చెంపపెట్టు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. మంత్రి కేటీఆర్ సొంత నియోజకవర్గం సిరిసిల్లలో టీఆర్ఎస్ రెబల్స్ గెలవటం సిగ్గుచేటు అని అన్నారు. ఏకపక్షంగా మున్సిపాలిటీలను గెలుస్తామన్న కేటీఆర్ ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ లేనేలేదన్న కేటీఆర్.. గద్వాల, నిజామాబాద్, భైంసా, ఆమనగల్ తదితర ప్రాంతాలకు వెళ్లి చూస్తే బీజేపీ ఎక్కడుందో తెలుస్తుందని కౌంటర్ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో శనివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్‌ను ఎదుర్కొని బీజేపీ నిలిచిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల కంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించిందని చెప్పుకొచ్చారు. మంత్రి ఈటల రాజేందర్ నియోజకవర్గంలో నాలుగు వార్డులు గెలిచామని అన్నారు. ఇంట గెలవని కేటీఆర్ రచ్చ గెలవటం కల అని లక్ష్మణ్ వ్యాఖ్యానిం చారు. బీజేపీ ఒంటరిగా 85 శాతం స్థానాల్లో పోటీ చేయటమే తమ మొదటి విజయం అని పేర్కొన్నారు. తెలంగాణలో నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతున్నామని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీజేపీ భవిష్యత్‌కు నాంది అని పేర్కొన్నారు. ఎక్కువ చైర్మన్ పదవులు రాకపోయినా వార్డులు గెలవటం సంతోషంగా ఉందన్నారు. 2023 ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం అని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.

తమిళనాట సరికొత్త రాజకీయాలు

పెరియార్ నాస్తికత్వాన్ని ప్రశ్నించేలా రజనీ వ్యాఖ్యలు
తేనెతుట్టె కదిపే ప్రయత్నంలో సూపర్‌స్టార్
రాజకీయ వ్యూహాల్లో భాగమే అంటున్న విశ్లేషకులు

చెన్నై,జనవరి25(ఆర్ఎన్ఎ): తమిళనాడు పాలిటిక్స్ ఇప్పుడు ద్రవిడ ఉద్యమ నేత, ప్రముఖ సంఘ సంస్కర్త పెరియార్ చుట్టు తిరుగుతున్నాయి. పెరియార్ ర్యాలీపై రజనీకాంత్ వ్యాఖ్యలతో ఇప్పుడు అక్కడి రాజకీయాలు వేడెక్కాయి. రాజకీయాల్లోకి రానున్న తరుణంలో రజనీకాంత్ చాలా వ్యూహాత్మకగా ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారని పలువురు విశ్లేషిస్తున్నారు. ద్రవిడ ఉద్యమం ఉధృతంగా సాగినకాలంలో పెరియార్ ఏం చేసినా, ఏంచెప్పినా పెద్దగా పట్టించుకోలేదు. అలాగే అక్కడ నాస్తిక ఉద్యమం కూడా ఆయనయ చుట్టూ పెనవేసుకుని నడిచింది. నాస్తిక ఉద్యమం కారణంగా కరుణానిధి లాంటి వారుకూడా దానిని అనుసరించారు. దీంతో ఎంతో వైభవం సాధించిన శైవ సంప్రదాయం అక్కడ మరుగున పడింది. అలాగే చారిత్రక ఆలయాలు కూడా పూజాపునస్కారాలుకూడా లేకుండా పోయాయి. పెరియార్ ప్రభావం తీవ్రత కారణంగా ద్రవిడ పార్టీలు బలపడ్డాయి. ప్రజలు కూడా అందుకు మద్దతుగా నిలిచారు. కానీ పరిస్థితులు మారుతూ వచ్చాయి. ఓ సందర్భంగా రజనీకాంత్ చేసిన వ్యాఖ్యలపై నిరసనలు కొనసాగుతుంటే.. మరోవైపు గుర్తుతెలియని వ్యక్తులు విధ్వంసం సృష్టించారు. చెంగల్పేట్ జిల్లా కలియపట్టాయి గ్రామంలో పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. పెరియార్ విగ్రహం కుడిచేయి, ముఖం దెబ్బతినడంతో గ్రామస్థుల ఆందోళనకుగురయ్యారు. స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు..దుండగుల కోసం గాలిస్తున్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన తుగ్లక్ పత్రిక 50వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రజనీ ద్రవిడ సిద్ధాంతకర్త పెరియార్‌పై కొన్ని వ్యాఖ్యలు చేశాడు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడిన రజనీ 1971లో సేలంలో నిర్వహించిన ఓ ర్యాలీని గుర్తుచేశారు. అప్పట్లో పెరియార్ సీతారాముల ప్రతిమలను నగ్నంగా తీసుకెళ్లారని రజనీ వ్యాఖ్యానించారు. ఇది అప్పట్లో బయటకు రాకుండా ప్రభుత్వం జాగ్రత్తపడిందని చెప్పుకొచ్చాడు. నిజానికి ఆనాటి ఘటనలను మాత్రమే రజనీకాంత్ ఉదాహరించారు. దీనిపై కొన్ని తమిళ సంఘాలు రజనీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆయన ఇంటి ముందు ఆందోళనలు కూడా చేపడుతున్నాయి. అయినప్పటికీ రజనీ తన వ్యాఖ్యలపై క్షమాపణలు చేప్పేది లేదని, తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఇక తాజాగా ఈ విషయంపై ద్రావిడర్ విడుదలై కళగం నేతలు రజనీపై మండిపడుతున్నారు. తన వ్యాఖ్యలతో పెరియార్ గౌరవ ప్రతిష్ఠకు భంగం కలిగించారని రజనీపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొళత్తూర్ మణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెరియార్‌ను కించపరిచిన రజనీకాంత్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆయనపై చర్యలకు హైకోర్టు తిరస్కరించింది. రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న రజనీకాంత్ ఈ వ్యాఖ్యల ద్వారా కావాలనే తుట్టెను కదిపారా అన్నది అనుమానంగా ఉంది. బహుశా అదే నిజమైతే ఇక రజనీ మరింత దూకుడుగా ద్రవిడ పార్టీలను ఎండగట్టడానికి సిద్ధంగా ఉన్నారని అర్థం చేసుకోవచ్చు.

కాశ్మీర్‌లో ఇంటర్‌నెట్ సేవలు పునరుద్ధరణ

పరిమిత సంఖ్యలో వెబ్‌సైట్లకు అనుమతి

శ్రీనగర్,జనవరి25(ఆర్ఎన్ఎ): దాదాపు ఆరు నెలల తర్వాత జమ్ముకశ్మీర్‌లో 2జీ మొబైల్, ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించారు. ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ వినియోగదారులు ఈ సేవలను ఉపయోగించు కోవచ్చు. కానీ, కేవలం 301 వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించుకునేందుకు అనుమతిస్తున్నట్లు జమ్ముకశ్మీర్ యంత్రాంగం నోటీసులు విడుదల చేసింది. జనవరి 25 నుంచి కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ము, కశ్మీర్ వాసులకు మొబైల్ డేటా సర్వీసులు, ఇంటర్నెట్ సేవలను కొన్ని ఆంక్షలతో పునరుద్ధరి స్తున్నాం. నేటి నుంచి జనవరి 31, 2020 వరకు ఇది అమల్లో ఉంటుంది. విధించిన ఆంక్షలను పరిశీలించి వాటిని త్వరలోనే పునరుద్ధరిస్తాం' అని అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. అన్ని జిల్లాలోని ప్రజలు ఈ సేవలను ఇకనుంచి పొందవచ్చని తెలిపింది. 2జీ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించడం పై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. 'ఇది చాలా పెద్ద ఊరట. ఇంటర్నెట్ లేకపోవడంతో ప్రపంచంతో కశ్మీరీలకు సంబంధాలు తెగిపోయినట్లుగా అనిపించింది. ఎంతో పోరాడిన తర్వాత ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించారు. కనీసం ఉద్యోగాలకు సంబంధించిన మెయిల్స్ చెక్ చేసుకునే సదుపాయం లభించింది. ఎటువంటి ఆంక్షలు లేకుండా పూర్తి స్థాయిలో సేవలను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తారని ఆశిస్తున్నాను' అని స్థానికులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంపై సుప్రీంకోర్టు ఇటీవల కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇంటర్నెట్ సేవలను పొందడం ప్రజల